# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 7-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 207 పేజీలు:6 వెల: రూ.1/-


## టెర్రరిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఐదుగురు జవాన్ల మృతి

జమ్ము కశ్మీర్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి ఘాతుకానికి పాల్పడ్డారు. రాజౌరీ జిల్లాలోని కాండి అటవీ ప్రాంతంలో శుక్రవారం టెర్రరిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఐదుగురు జవాన్లు మరణించారు. ఉగ్రవాదులు సైనికులపై పేలుడు పదార్థం విసిరారని ఆర్మీ పేర్కొన్నది. ఇటీవల జమ్ము రీజియన్‌లో ఆర్మీ ట్రక్‌పై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకొనేందుకు సైన్యం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నది. ఈ క్రమంలో రాజౌరీ సెక్టార్ పరిధిలోని కాండి అడవిలో కొంతమంది ఉగ్రవాదులు దాగివున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో భద్రతా బలగాలు బుధవారం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో అడవిలోని ఓ గుహలో ఉగ్రవాదులు దాగివుండటాన్ని జవాన్లు శుక్రవారం ఉదయం గుర్తించారు. దీంతో సైనికులు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు జరిగాయి. జవాన్లపై ఉగ్రవాదులు పేలుడు పదార్థం విసరడంతో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉదంపూర్ దవాఖానకు తరలించారు. తీవ్ర గాయాలతో మరో ముగ్గురు దవాఖానలో మరణించారని ఆర్మీ పేర్కొన్నది. కాగా, గాలింపు కొనసాగుతున్నదని, అదనపు బలగాలను కూడా రప్పించినట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. టెర్రరిస్టు గ్రూపులో కొంత మంది హతమై ఉంటారని భావిస్తున్నామని ఆర్మీ పేర్కొన్నది.

## జీవో 58 క్రింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలి : మంత్రి తలసాని

హైదరాబాద్, మే6: జీవో 58 క్రింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పట్టాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న పట్టాలను వారం రోజుల్లోగా పంపిణీ చేసేలా పర్యవేక్షణ జరపాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ కు సూచించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జీవో 58, 59లపై, ఆసరా పెన్షన్లు, దళిత బంధు ఇతర కార్యక్రమాల అమలు పై సమీక్ష నిర్వహించారు.

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు , ఒంటరి మహిళలు గౌరవంగా బతకాలనే ఆలోచనతో ఆసరా పెన్షన్లను అందిస్తున్నామన్నారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 2.76 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెల రూ. 67 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు నుంచి 57 సంవత్సరాలు దాటిన వారికి కూడా నూతనంగా పెన్షన్ లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.దళిత బంధు మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 100 మంది చొప్పున హైదరాబాద్ జిల్లా లోని 15 నియోజకవర్గాలలో మొత్తం 1484 మంది ని గుర్తించి ఒక్కొక్కరికి రూ.10 లక్షల వ్యయంతో వివిధ యూనిట్లను అందజేశామని వివరించారు. ఈ యూనిట్లు అన్ని సక్రమంగా పని చేస్తున్నాయా? లేదా? పరిశీలించాల్సిన బాధ్యత ఎస్సీ కార్పొరేషన్ అధికారులపైనే ఉన్నదని మంత్రి స్పష్టం చేశారు.రెండో విడత దళితబంధుఅమలుకు సంబంధించి ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నదని తెలిపారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకొనే వారికి ప్రభుత్వం రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు గృహ లక్ష్మి పథకం అమలుకు మార్గదర్శకాలు రానున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, ఎమ్మెల్సీ లు ప్రభాకర్ రావు, సురభి వాణిదేవి, స్టీఫెన్ సన్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బలాల,ముంతాజ్ అహ్మద్ ఖాన్, కలెక్టర్ అమయ్ కుమార్అధికారులు పాల్గొన్నారు.

## స్వల్పంగా తగ్గినా మద్యం ధరలు

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మద్యం ప్రియులకు తెలంగాణ సర్కార్ అదిరిపోయే శుభావార్త చెప్పింది. తెలంగాణలో మద్యం ధరలు భారీగా తగ్గాయి. ధరలు తగ్గిస్తున్నట్లు శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. మద్యంపై రాష్ట్ర ప్రభుత్వం విధించే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీంతో మద్యం ధరలు తగ్గిపోయాయి. బీర్ మినహా లిక్కర్‌కు చెందిన అన్ని బ్రాండ్లపై ధరలు తగ్గాయి. అధిక ధరలు కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఇకపై అలా ఉండకూడదని దీన్ని నియంత్రించేందుకు ధరలు తగ్గించినట్లు అధికారులు తెలిపారు.

ధరలు తగ్గింపు ఇలా..

క్వార్టర్‌పై : రూ.10 తగ్గింపు,హాఫ్‌పై : రూ.20 తగ్గింపు,ఫుల్‌పై : రూ. 40 చొప్పున ధరలు తగ్గాయి. మరోవైపు.. కొన్ని రకాల బ్రాండ్స్‌లో ఫుల్ బాటిళ్లపై 60 రూపాయిల వరకు తగ్గిస్తున్నట్లు అబ్కారీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కాగా తగ్గిన ఈ ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉంటే.. కరోనా లాక్‌డౌన్ తర్వాత ఆదాయాన్ని పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా మద్యం ధరలను పెంచిన సంగతి తెలిసిందే. దీంతో జనాలంతా పక్క రాష్ట్రాలకు వెళ్లి మరీ తెచ్చుకుంటూ ఉండటంతో అబ్కారీ అధికారులు పై నిర్ణయం తీసుకున్నారు.

## న్యాయవ్యవస్థ సమయాన్ని వృథా చేసినందుకు రూ.10వేల జరిమానా

న్యూ డిల్లీ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పరిష్కారమైన సమస్యపై మళ్లీ కోర్టులో కేసు వేసిన వ్యక్తిని సుప్రీంకోర్టు మందలించింది. అదే విషయంపై పదే పదే కోర్టుకు తీసుకురావడం న్యాయవ్యవస్థ సమయాన్ని వృథా చేడయమేనంటూ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సదరు వ్యక్తికి జరిమానాను సైతం విధించింది.

ఓ సమస్యను అత్యున్నత స్థాయిలో పరిష్కరించిన తర్వాత మళ్లీ మళ్లీ లేవనెత్తే దృశ్యం న్యాయవ్యవస్థలో ఉండదని కోర్టు పేర్కొంది. దాంతో న్యాయ వ్యవస్థ సమయం వృథా అవుతుందని పేర్కొంది.

ఓ వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగించగా.. దీనిపై సుప్రీంకోర్టు విచారించి.. 2004 కేసును ముగించింది. అయితే, తనకు అన్యాయం జరిగిందని, దీనిపై మళ్లీ విచారణ జరుపాలని కోరుతూ కోర్టును ఆశ్రయించాడు. దీనిపై జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం.. తనకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ పిటిషనర్ రిట్ పిటిషన్ చేశారు. రాజ్యాంగంలోని 32వ అధికరణం కింద వ్యక్తులు తమ ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిన సమయంలో న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కును కల్పించింది.

మే 1న జారీ చేసిన ఉత్తర్వులో బెంచ్ ఏ న్యాయ వ్యవస్థలోనూ ఒక వ్యక్తి ఒకే సమస్యను అత్యున్నత స్థాయిలో పలుమార్లు పరిష్కరించే దృశ్యం ఉండదని పేర్కొంది. ఇది న్యాయవ్యవస్థ సమయాన్ని పూర్తిగా వృథా చేయడమేనని, సమయం వృథా చేసినందుకు జరిమానా విధించడంతో పాటు పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. సదరు వ్యక్తి నిరుద్యోగి కావడంతో ధర్మాసనం రూ.10వేల జరిమానా విధించింది. సంబంధిత మొత్తాన్ని సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ వెల్ఫేర్ ఫండ్‌లో డిపాజిట్ చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

### నేటి కందం- నేటికి అందం



(మే 7 ప్రపంచ నవ్వుల దినోత్సవం..)

-రాధశ్రీ

సెల్:9494481210

# రేవంత్ రెడ్డి చేసిది రంధ్రాన్వేషణ

### -తెలంగాణను భారతదేశంలో అగ్రశ్రేణి రాష్ట్రంగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం

### - బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్




మహబూబ్‌నగర్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు పాలమూరు పౌరుషాన్ని చూపించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చెప్పారు. ఐటీ టవర్‌తో పాటు పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఎన్నికలు సమీపంచే కొద్ది చాలా మంది టూరిస్టులు వస్తారు.. మొన్ననే రేవంత్ రెడ్డి పాలమూరకు వచ్చి మీటింగ్ పెట్టిండు. నోటికొచ్చినట్లు అడ్డగోలు మాటలు మాట్లాడారు.

తెలంగాణను తెచ్చిన సీఎం, రెండు సార్లు ప్రజల చేత ఎన్నుకోబడ్డ సీఎం. కేసీఆర్‌ను గౌరవించకుండా నోటికొచ్చినట్టు నీచమైన మాటలు మాట్లాడిండు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని రేవంత్ రెడ్డి అడుగుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి 55 ఏండ్లలో 11 సార్లు అధికారం ఇచ్చారు. 11 ఛాన్సులు ఇచ్చినప్పుడు ఒక్క మంచి పని కూడా చేలయేదు. మంచినీళ్లు, పరిశ్రమలు లేవు. సాగునీరు లేదు. కడుపు చేత పపట్టుకుని వలస పోయేవాళ్లు. అలాంటి పాలమూరును అభివృద్ధి చేశాం. రేవంత్ రెడ్డి రంధ్రాన్వేషణ చేస్తున్నారు. 55 ఏండ్లు పరిపాలించింది నీ సన్నాసి పార్టీ. ఇక్కడ తెలంగాణలో ఇంకా ఏమైనా దరిద్రం ఉందంటే అది నీ పార్టీ దిక్కుమాలిన నాయకత్వం వల్ల అని గుర్తు చేస్తున్నాను.

ఆనాడు అధికారం ఇచ్చినప్పుడు అన్ని చేసి ఉంటే నేడు ఎందుకు సమస్యలు ఉంటుండే. తెలంగాణను భారతదేశంలో అగ్రశ్రేణి రాష్ట్రంగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. ఇక ఎన్నికలు వస్తే నిన్నటి వరకు లేని ప్రేమలను ఇప్పుడు కురిపిస్తారు. 55 ఏండ్లు అధికారం ఇస్తే ఏం చేయని సన్నాసులు.. ఇప్పుడు చేస్తారా..? అనే విషయాన్ని ఆలోచించాలని కేటీఆర్ ప్రజలకు సూచించారు.

నిరుద్యోగ మార్చ్ అని మరో సన్నాసి ఇక్కడ మీటింగ్ పెట్టిండు. 2014లో మోదీ పెద్ద పెద్ద మాటలు చెప్పిండు. రూ. 15 లక్షలు ఇస్తానన్నాడు. కానీ ఇవ్వలేదు. రూ. 15 లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేసిన మోదీ ఒక దిక్కు ఉన్నాడు.. 15 లక్షల మంది వలసలు ఆపి ఉపాధి కల్పించిన కేసీఆర్ మరో దిక్కు ఉన్నాడు. ఆలోచించి ఓటేయండి తప్పా ఆగం కాకండి. పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని ఇదే గ్రౌండ్‌లో మోదీ, అమిత్ షా చెప్పారు. మరి ఇచ్చారా..? రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేండ్లు అవుతున్నా.. కృష్ణా నదిలో మన వాటా, ఏపీ వాటా తేల్చలేదు. దాని మీద ఇంత వరకు స్పందన లేదు. రైతుల ఆదాయం పెంచలేదు.. కానీ అదానీ ఆదాయం పెంచిండు. గుజరాతోళ్ల చెప్పులు మోసేటోళ్లు మన రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. గుజరాతీ గులామ్‌లు ఇక్కడ ఉన్నారు. కానీ రోషం కల్ల తెలంగాణ బిడ్డలు, పాలమూరు పౌరుషంతో ఉండే తమ్ముళ్లంతా ఆలోచన చేయాలి. ఎవరు ఈ రాష్ట్రానికి మంచివారు. ఎవరి వల్ల ఈ రాష్ట్రంలోని రైతు బాగుపడుతాడు అనే విషయాన్ని ఆలోచించాలి. పెద్దలకు రుణాలు మాఫీ చేసే సన్నాసులు కావాల్నా.. పేద ప్రజల కష్టాల్లో అండగా ఉండే కేసీఆర్ కావాల్నా ఆలోచించుకోవాలి. నెర్రెలు బారిన నేలలో, నెత్తురు కారిన తెలంగాణలో ఇప్పుడిప్పుడే నీళ్లు వస్తున్నాయి. ఈ దిక్కుమాలిన పార్టీలకు అవకాశం ఇస్తే నెత్తురు కారే రోజులు తీసుకొస్తారు. మతం మంటల్లో ఉండే తెలంగాణ కావాల్నా.. పచ్చని పంటలతో ఉండే తెలంగాణ కావాల్నా.. రైతులు, ప్రజలు ఆలోచించాలి అని కేటీఆర్ సూచించారు.

## ఫారెస్ట్ జంగల్ సఫారీని ప్రారంభించిన మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, మే6: రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్ కలిసి మహబూబ్ నగర్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా దేశంలో అతిపెద్ద అర్బన్ టూరిజం పార్క్ అయినా కేసీఆర్ అర్బన్ ఎకో టూరిజం పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఫారెస్ట్ జంగల్ సఫారీని మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

అనంతరం ఫారెస్ట్ జంగల్ సఫారీలో భాగంగా నిర్మించిన వాచ్ టవర్‌ను పరిశీలించారు. ఫారెస్ట్ సఫారీ చేసే సమయంలో ఆకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. వర్షంలోనూ సఫారిని కొనసాగిస్తూ వాచ్ టవర్ నుండి ఫారెస్ట్‌ను తిలకించారు. మహబూబ్‌నగర్ పట్టణానికి అతి సమీపంలో ఉన్న ఫారెస్ట్ పార్కులో జంగల్ సఫారీ ఎంతో అద్భుతంగా ఉందని మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. పర్యాటకులకు ఈ సఫారీ మధురమైన జ్ఞాపకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం

### – డ్రగ్స్ ఫెడ్లింగ్ చేస్తున్న నలుగురితో కలిసిన గ్యాంగ్‌ను అరెస్ట్

### –303 గ్రాముల కొకైన్ సీజ్... సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టుబడిన విషయం తెలిసిందే. డ్రగ్స్ ఫెడ్లింగ్ చేస్తున్న నలుగురితో కలిసిన గ్యాంగ్‌ను అరెస్ట్ చేశామని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. 303 గ్రాముల కొకైన్ సీజ్ చేశామని తెలిపారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఈ డ్రగ్స్ ముఠాకు కింగ్ పిన్‌గా చింతా రాకేష్ అనే వ్యక్తి వ్యవహరిస్తున్నాడని వెల్లడించారు. చింతా రాకేష్ లోకల్‌గా ఇద్దరు పెడ్లర్‌లను హైర్ చేసుకున్నాడని తెలిపారు.ఇంకా సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ.. "చింతా రాకేష్ గోవాకు వెళ్లినపుడు నైజీరియన్స్ గాబ్రియేల్, విక్టర్‌తో పరిచయం ఏర్పడింది.. గోవాలో ఓసారి కొకైన్ తీసుకున్నాడు... క్రమంగా డ్రగ్స్‌కు రాకేష్ అడిక్ట్ అయ్యాడు. ఏ1 రాకేష్ రోషన్ డ్రై ఫ్రూట్స్ వ్యాపారం చేసి నష్టపోయాడు. రాకేష్ గాబరియాల దగ్గర కొకైన్ గ్రాముకు 7వేల రూపాయలకు కొని.. హైదరాబాదులో గ్రాముకు18 వేల చొప్పున విక్రయిస్తున్నాడన్నారు. బాచుపల్లికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తిని సహ పెడ్లర్‌గా నియమించుకున్నాడు. శ్రీనివాస్ రెడ్డి కూడా వ్యాపారంలో నష్టపోయాడు. రాకేష్ శ్రీనివాస్ రెడ్డిని గోవాకు పంపి అతని ద్వారా నగరానికి తెప్పించేవాడు. శ్రీనివాస్ విక్రయించడంతోపాటు కమిషన్‌ను రాకేష్‌కు ఇచ్చేవాడు. సూర్య ప్రకాష్ అనే మరో వ్యక్తిని కూడా రాకేష్ సహ పెడ్లర్‌గా నియమించుకున్నాడు.

రాకేష్ సూచన మేరకు సూర్య ప్రకాష్ 23 గ్రాముల కొకైన్ తీసుకువచ్చాడు. అందులో ఆరు గ్రాములు శ్రీనివాస్ రెడ్డికి ఆరు గ్రాములు రాకేష్ కు ఇచ్చాడు. హైదరాబాద్‌లో డ్రగ్స్‌కు డిమాండ్ ఉందని నగరానికి రావాలని విక్టర్‌కు సూర్యప్రకాష్ సూచించాడు. ఇందులో భాగంగా 100 గ్రాముల కొకైన్‌తో విక్టర్ నగరానికి చేరుకున్నాడు. కొకైన్ విక్రయిస్తుండగా నానక్‌రాం గూడాలో సూర్య ప్రకాష్, విక్టర్‌లను అదుపులోకి తీసుకున్నాం. సూర్య ప్రకాష్‌ను విచారించగా శ్రీనివాస్ రెడ్డి చింతా రాకేష్‌ల పాత్ర బయటపడింది. వినియోగదారుల లిస్ట్ ఉంది.. వారిని గుర్తించి నోటీస్ ఇస్తామన్నారు. గాబ్రియల్ నైజీరియాకు వెళ్లిపోవడంతో విక్టర్ మాత్రమే పట్టుబడ్డాడు.చాలాకాలంగా ఈ గ్యాంగ్ డ్రగ్స్ విక్రయిస్తోంది. వాట్సాప్ ద్వారా డ్రగ్స్ క్రయవిక్రయాలను కొనసాగించారు వాట్సాప్ చాట్ కూడా సంపాదించాం. విక్టర్ దగ్గర డ్రగ్స్ క్యాప్సుల్స్ దొరికాయి. వాస్తవానికి ఈ క్యాప్సుల్స్‌ను కడుపులో పెట్టుకొని అక్రమంగా తరలిస్తూ ఉంటారు. నిందితుల వద్ద సేకరించిన సమాచారం ప్రకారం డ్రగ్స్ వినియోగదారులు బిజినెస్ మాన్స్ కూడా ఉన్నారు. నిడిదలు పార్టీలకు కూడా ఒక అయిన సరఫరా చేసినట్టు తేలింది. నిందితులను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి" అని పేర్కొన్నారు.

## దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న సంక్షేమ పథకాలు

### –పలు అభివృద్ధి కార్య క్రమాలలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి



షాద్ నగర్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమ పథకాలలో మునుముందుకు పరుగులు పెడుతుందని మంత్రి సబితా రెడ్డి అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు గదులు, ప్రహరీ గోడ, మౌలిక వసతుల కల్పన పనులను స్థానిక ఎమ్మెల్యే అంజ య్య యాదవ్తో కలిసి ప్రారంబించారు. వీటితో పాటు రూ. 1.55 కోట్లు, కొందుర్గు మండలం మహాదేవపూర్ లో రూ.15 లక్షలతో బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన , నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో 2 కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభిం చారు. అనంతరం మంత్రి సబితా మాట్లాడుతూ రాష్ట్రప్రజల క్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్నసంక్షేమ పథకా లు దేశానికిఆదర్శంగా నిలుస్తు న్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయ కులకు అభివృద్ధి కనబడడం లేదని,కల్లుంది చూడలేని కాబోతుల్ల వ్యవహరిస్తున్నట్లు విమర్శించారు.

## క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయం : మంత్రి ఎర్రబెల్లి

హన్మకొండ, మే6: (నేటినిజం ప్రతినిధి): కరుణ, ప్రేమ, సేవ అన్న క్రీస్తు బోధనలుఅందరికీ ఆచరణీయ మని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హనుమకొండ జిల్లా పెద్ద పెండ్యాల కరుణాపురం క్రీస్తు జ్యోతి చర్చిని ప్రారంభించిన సందర్భంగా ఏసు భక్తులతో కలిసి మంత్రి చర్చిలో ప్రార్ధనలు చేశారు.

ఆయన మాట్లాడుతూ ' క్రీస్తుబాట లో నడిస్తే ప్రపంచంలో మోసాలు, పాపాలు ఉండవని, యుద్ధాలకు ఆస్కారం లేదని అన్నారు.అన్ని మతాల సారం మానవత్వమే. అన్ని మతాలకు దేవుడు ఒక్కడే . ఈ బోధనల ప్రేరణతో సీఎం కేసీఆర్ పరిపాలన చేస్తున్నారని' పేర్కొన్నారు.

దాదాపు 150 కోట్లతో ఆసియా ఖండంలోనే అతి పెద్ద చర్చిని నిర్మించిన పాల్ నన్ రాజ్ అతని బృందానికి ఆయన అభినందనలు తెలిపారు.

తెలంగాణలో క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. వారి ఆత్మగౌరవం పెంపొందించేలా 2 ఎకరాల స్థలంలో రూ. 10 కోట్లతో క్రిస్టియన్ భవనం నిర్మిస్తున్నామని అన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా చర్చిల నిర్మాణానికి, మరమ్మతులకు, ఆధునీకరణకు, మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వ నిధులు ఖర్చు పెట్టేందుకు అనుమతి నిచ్చిన ఏకైక ప్రభుత్వమని తెలిపారు. క్రిస్టియన్ విద్యార్థులకు, యువత కోసం పలు కార్యక్రమాలను చేపట్టామని గుర్తు చేశారు. క్రిస్టియన్లు కేసీఆర్కు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ పాల్ సన్ రాజ్, గోపు జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.






# సూడాన్‌లో సైనిక తిరుబాటుతో అంతర్యుద్ధ సంక్షోభం..!

సూడాన్‌లో 15 ఏప్రిల్ 2023న ప్రారంభమైన అంతర్గత సంక్షోభాగ్నికి, తుపాకుల మోతకు జడిసి వేల మంది అమాయకులు ప్రాణాలు వదలడం(ఐరాస నివేదిక ప్రకారం 413 మంది), లక్షకు పైగా ప్రజలు దేశ సరిహద్దులు దాటి వలసలు వెళ్లడం, అంతర్జాతీయ సంస్థలు శరణార్థులకు రక్షణ గొడుగులు పట్టడం జరుగుతోంది. సైనిక కమాండర్లు రెండు వర్గాలుగా విడిపోయి అధికారమే పరమావధిగా ఒకరి మీద మరొకరు దాడులు చేసుకునే స్థాయికి చేరడం విచారకరం. అక్టోబర్ 2021లో జరిగిన సైనిక తిరుగుబాటులో ప్రజా ప్రభుత్వం పడిపోయి ఆర్మీ చేతుల్లోకి పాలన పగ్గాలు చేరడంతో సూడాన్ ఆర్మీ, పారామిలటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌యస్‌పీ)ల మధ్య అధికారం కోసం అంతర్యుద్ధం మొదలు కావడం, మాసాలుగా కొనసాగడం చూస్తున్నాం. నాటి నుంచి నేటి వరకు సైనిక జనరల్స్ సభ్యులుగా ఏర్పడ్డ కౌన్సిల్ అధికారం చెలాయిస్తున్నట్లు వింటున్నాం.

**అధికారం, ఆధిపత్యం కోసం అంతర్యుద్ధం:**

సూడాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అబ్దెల్ ఫతే అల్–బుర్హాన్‌కు, ఆర్‌యస్‌యఫ్ లీడర్ జనరల్ మహమ్మద్ హమ్దాన్ డగాలో (సాధారణ పేరు హమెట్టీ)ల మధ్య అధికారం పగ్గాల విషయంలో బయటపడ్డ విభేదాలతో ఆర్మీ, పారామిలిటరీ ఆర్‌యస్‌యఫ్‌ల మధ్య భీకర పోరు నేటికీ కొనసాగుతూనే ఉండడం విచారకరం. బషీర్ నేతృత్వంలో పాలన నడుపుతున్న పౌర ప్రభుత్వాన్ని తిరుగుబాటుతో కూలదోసి అధికార పగ్గాలు చేపట్టడానికి ఆర్మీ చీఫ్ హెమట్టీ తెలివిగా సివిలియన్ పార్టీలతో కలిసి ఫోర్సెస్ ఫర్ ఫ్రీడమ్ అండ్ చేంజ్(యఫ్‌యఫ్‌సి) అనే సంకీర్ణ ప్రభుత్వం ద్వారా సూడాన్‌ను తనదైన శైలిలో దేశాధినేతగా ఏలడానికి తెలివిగా పావులు కదుపుతున్నారు.

ఆర్మీ చీఫ్ బుర్హనీ తీసుకుంటున్న నిర్ణయాలు హమెట్టీకి నచ్చకపోవడంతో విభేదాలు పెరిగి అంతర్యుద్ధానికి దారి తీసింది. సుమారు లక్ష మంది ఆర్‌యస్‌యఫ్ బలగాలను ఆర్మీలో విలీనం చేయడం, సైన్యానికి నాయకత్వం వహించడం లాంటి విషయాల్లో ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సాయుధ పోరు ప్రారంభమై తీవ్ర రూపం దాల్చింది.

సైనిక తిరుగుబాటు సరైన పద్ధతి కాదని, ప్రజాస్వామ్య ప్రభుత్వం కావాలని హమెట్టీ చెబుతూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజా ప్రభుత్వానికి పూర్తి అధికారాలు బదలాయిస్తానని బుర్హన్ నమ్మబలుకుతున్నారు. ఇద్దరు సైనిక జనరల్స్ మధ్య విభేదాలు ముదిరి 15 ఏప్రిల్‌న రాజధాని ఖార్తుమోతో పాటు ఇతర ప్రాంతాల్లో ఘర్షణలు ప్రారంభమైనాయి. 2013లో ఏర్పడిన ఆర్‌యస్‌యఫ్ బలగాలు బలపడి యెమెన్, లిబియా అంతర్యుద్ధాల్లో కూడా జోక్యం చేసుకునేంతగా ఎదిగి పోయాయి. ఆర్‌యస్‌యఫ్ నేత హమెట్టీ ఆదిపత్యంలో బంగారు గనులు కూడా ఉండడం కొస మెరుపుగా చెప్పుకోవాలి.

**పేదరికానికి పెట్టింది పేరు సూడాన్:**

గ్లోబల్ హంగర్ ఇండెక్స్–2023 జాబితాలో ప్రపంచవ్యాప్త 121 దేశాల్లో సూడాన్ 106వ స్థానంలో నిరుపేద దేశంగా ఉన్నది. సహారా ఎడారి ప్రాంతంలోని సూడాన్‌లో వాతావరణ ప్రతికూలతల, సహజ వనరుల లేమితో అత్యంత హృదయవిదారక దుస్థితిలో ప్రజలు మగ్గుతున్నారు. అత్యంత పేదరికాన్ని అనుభవిస్తున్న ఆఫ్రికా ఖండంలోని సూడాన్‌లో మొదలైన ఈ పోరాటంతో 4.79 కోట్ల ప్రజల బతుకులు గోరుచుట్టుపై రోకలి పోటులా మారడం చూస్తున్నాం. బషీర్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దశాబ్దాలుగా నిరంకుశత్వం, అంతర్గత సంక్షోభం, ఆర్థిక దివాళ/ఆంక్షలు, ఆకలి కేకలు వంటి సమస్యలతో అనాదిగా సతమతమవుతున్నది. జనాభాలో దాదాపు తెలంగాణను పోలిన సూడాన్ వైపు ప్రపంచ దేశాలు దీనంగా చూడడం జరుగుతోంది. సూడాన్‌లో ఉన్న వివిధ దేశస్థులను తమ తమ ప్రభుత్వాలు తిరిగి వెనక్కి తీసుకురావడానికి కూడా అత్యంత చొరవను చూపాల్సి వస్తున్నది. అరబిక్, ఆంగ్లం మాట్లాడే సూడాన్‌లో ముస్లిమ్‌లు మెజారిటీగా ప్రజల సగటు ఆదాయం రోజుకు రూ: 167/– మాత్రమే ఉండడం ఆ దేశ దుస్థితికి అద్దం పడుతున్నది.

**విజయవంతమైన ఆపరేషన్ కావేరి:**

సూడాన్‌లో స్థిరపడిన దాదాపు 1500 మంది భారతీయులతో పాటు 3000 మంది భారతీయులు ఘర్షణల్లో చిక్కుకుపోవడంతో వారిని దేశానికి సురక్షితంగా తీసుకురావడానికి భారత ప్రభుత్వం 'ఆపరేషన్ కావేరి' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నది.

అమెరికా, యూకె, సౌదీ, యూఏఈ, ఈజిప్ట్ లాంటి దేశాలు తమ పౌరులను తరలించడం జరుగుతోంది. దేశాన్ని వదిలి వెళ్లేందుకు సూడాన్ ప్రజలు వేల సంఖ్యల్లో సరిహద్దులకు చేరడం, రవాణా సదుపాయాలు లేకపోవటంతో డైవర్లు లక్షల్లో దోపిడీ చేయడం జరుగుతోంది. కాలినడకన దేశ సరిహద్దులు దాటడాన్ని నిషేధించడంతో 30 కిమీ బస్సు ప్రయాణానికి రూ: 32 లక్షలు (40 వేల డాలర్లు) అడుతున్న డైవర్ల దోపిడీతో సూడాన్‌లో గందరగోళం, ప్రాణభయం, అభద్రత, ఆకలి కేకలు రాజ్యమేలుతున్నాయి. బ్యాంకులు, ఏట్రియంలు మూసివేయడంతో ప్రజలు డబ్బుల్లేక నరకయాతన పడుతున్నట్లు తెలుస్తున్నది.

**వైరస్/బాక్టీరియా బాంబులు పేలనున్నాయా?!**

సూడాన్‌లోకి కేంద్ర పరిశోధనాలయం (సెంట్రల్ ల్యాబ్) ఆర్మీ లేదా ఆర్‌యస్‌యఫ్ బలగాల చేతుల్లోకి చేరితే వివిధ రకాల వ్యాధుల శాంపిల్స్‌లో ట్యాంపరింగ్ జరిగి ప్రపంచంలో వైరస్/బాక్టీరియా వ్యాధుల బాంబులు పేలవచ్చని కూడా భయపడుతున్నారు. ప్రపంచాన్ని నాశనం చేయడానికి ఇదొక్కటే చాలని డబ్ల్యూహెచ్ఓ లాంటి సంస్థలు హెచ్చరికలు చేస్తున్నాయి. అనేక సందర్భాల్లో విపత్తులు/సంక్షోభాల కోరల్లో చిక్కిన శ్రీలంక, టర్కీ, సిరియా లాంటి దేశాలకు సకాలంలో స్పందించి ఆపన్నహస్తం అందించిన భారత్ నేడు సూడాన్‌లో నెలకొన్న సంక్షోభాన్ని అంతం చేయడానికి మధ్యవర్తిత్వం చేయాలని కూడా పౌరులు సూచిస్తున్నారు.

ప్రపంచంలో ఏదో ఒక మూలన, ఏదో ఒక దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనడం, సామాన్య ప్రజలు విలవిల్లాడడం, ప్రాణాలు కాపాడుకోవడానికి సరిహద్దుల వైపు పరుగు తీయడం, దాడుల్లో మరణించడం/గాయపడడం జరుగుతూనే ఉన్నాయి.

365 రోజులు దాటిన ఉక్రెయిన్–రష్యా యుద్ధంతో ప్రపంచ దేశాలు భారీ ఆర్థిక మూల్యాలను చెల్లిస్తూనే ఉన్నాయి. శ్రీలంక, పాకిస్థాన్ లాంటి దేశాల్లో ఆకలి కేకల ఆర్తనాదాలు వింటూనే ఉన్నాం. వివిధ సందర్భాల్లో పొడచూపుతున్న సంక్షోభాలను ఆదిలోనే అంతం చేయడానికి ఐరాస లాంటి సంస్థలు చొరవ తీసుకోవాలి. ప్రపంచంలో ఏ మూలన యుద్ధం జరిగినా దాని మూల్యాన్ని ప్రపంచ మానవాళి అందరూ చెల్లించాల్సి వస్తున్నదన్న విషయం మరిచిపోరాదు.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# మహానాడు వేదికగా బిగ్ పొలిటికల్ బ్లాస్టింగ్...?

అమరావతి మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలుగుదేశం పార్టీ ప్రతీ ఏటా మహానాడు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. గత ఏడాది ఒంగోలులో మహానాడు నిర్వహించి పార్టీకి ఊపు తెచ్చింది. ఈసారి గోదావరి జిల్లాల ముఖ ద్వారం అయిన రాజమండ్రీలో మహానాడు నిర్వహించాలని చూస్తోంది. ఈ నెల 27 28 తేదీలలో జరిగే ఈ మహానాడులో రాజకీయ సంచలనాలు అనేకం ఉంటాయని తెలుస్తోంది.మహానాడు తరువాత ఎన్నికలకు వెళ్లడమే జరుగుతుంది కాబట్టి ఇది పార్టీకి చాలా అవసరంగా చెబుతున్నారు. మహానాడు లో రాజకీయ తీర్మానాలు అన్నీ కూడా అదే విధంగా ఉంటాయని తెలుస్తోంది. అలాగే ఈసారి మహానాడులో వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే ఏమి చేయబోతోంది అన్న దాని మీద కూడా ప్రజలకు బాబు తెలియచేస్తారని అంటున్నారు. చంద్రబాబు ముగింపు ప్రసంగంలో అనేక హైలెట్స్ ఉండేలా చూస్తున్నారు. అదే విధంగా మహానాడులో పొత్తుల విషయం కూడా చంద్రబాబు ప్రస్తావిస్తారని తెలుస్తోంది. ఒక విధంగా ఏపీలో గత ఏడాదిగా కొనసాగుతున్న పొత్తుల ఎత్తులు అనేక చర్చకు సందేహాలకు ఒక ముగింపు ఇచ్చేలా కీలక సందేశం ఇస్తారని అంటున్నారు.ఇక వీటన్నిటికంటే రాజకీయంగా వైసీపీని దెబ్బ తీసే విధంగా బాబు కొత్త వ్యూహాలు రచిస్తున్నారు. ఈసారి మహానాడులో వైసీపీ నుంచి భారీ చేరికలకు ప్లాన్ వేస్తున్నారు ఇప్పటికే వైసీపీ నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసింది. అదే సమయంలో మరికొందరు వైసీపీలో అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు. ఇలా ఉన్న వారిని టీడీపీ ఐడెంటిఫై చేసిందట. వారితో సంప్రదింపులు జరుగుతున్నాయని అంటున్నారు. ఇలా పార్టీ వైపు వచ్చిన వారిని చేర్చుకోవాలని కూడా వైసీపీ మాస్టర్ ప్లాన్ వేస్తోంది. ఇక నెల్లూరు జిల్లా నుంచి రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి రెండు రోజుల క్రితం రాజమండ్రీ వచ్చి టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కుటుంబాన్ని పరామర్శించి వెళ్లారు.అంతే కాదు ఆయన ఒక అరగంటకు పైగా స్థానిక ఎమ్మెల్యే టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కూడా భేటీ అయ్యారు. ఈ భేటీ విషయం సంచలనంగా మారింది. ఈ సందర్భంగా కోటం రెడ్డి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కానీ జనసేన కానీ టికెట్ ఇస్తామని హామీ ఇస్తే మాత్రం వైసీపీ నుంచి పెద్ద ఎత్తున వలసలు ఉంటాయని. మరి కోటం రెడ్డి ఊరికే ఆ మాటలు అన్నారా లేక రాజకీయంగా వీటికి ప్రాధాన్యత ఉందా అన్న దాని మీద కూడా అంతా చర్చిస్తున్నారు.మరో వైపు చూస్తే టీడీపీ ఎక్కువగా నెల్లూరు ప్రకాశం జిల్లాల మీద ఫోకస్ పెట్టింది. గత ఎన్నికల్లో నెల్లూరులో పదికి పది సీట్లను వైసీపీ సాధించింది. ఇక ప్రకాశం జిల్లాలో పన్నెండు సీట్లకు గానూ ఎనిమిదింటిని గెలుచుకుని వైసీపీ జెండా ఎగరవేసింది. అలాంటి చోట ఇపుడు వైసీపీలో లుకలుకలు కనిపిస్తున్నాయి.అవి ఎక్కడా ఆగడంలేదు. దాంతోనే ఇపుడు టీడీపీ వైసీపీని టార్గెట్ చేస్తోంది అని అంటున్నారు. వైసీపీ నేతలు వేసుకుంటున్న అంచనాలు చంద్రబాబు రాజకీయ చాణక్యం కనుక వర్కౌట్ అయితే ఎవరూ ఊహించని ముఖాలే మహానాడు వేదిక మీద వైసీపీ నుంచి కనిపిస్తాయని. అలా తెలుగుదేశంలో చేరికలకు మంచి ఊపు వస్తుందని తేవాలని తమ్ముళ్ళు ఆరాటపడుతున్నారు.ఏది ఏమైనా ఈసారి మహానాడుతో ఏపీ రాజకీయాలను కీలకమైన మలుపు తిప్పాలని చంద్రబాబు చూస్తున్నారు. దానికి తగినట్లుగా ఆయన యాక్షన్ ప్లాన్ రెడీ చేసి పెట్టుకుంటున్నారు మరి చంద్రబాబు రాజకీయం సక్సెస్ అవుతుందా. వైసీపీ నుంచి సస్పెండ్ అయిన వారితో పాటు కొత్త వారు ఎవరైనా టీడీపీ వైపు అడుగులు వేస్తారా అన్నది తెలియాలంటే ఈ నెల 27 వరకూ వేచి చూడాల్సిందే అంటున్నారు.

# మే 8, 2023న 200లకు పైగా జిల్లాల్లో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 6:స్కిల్ ఇండియా మిషన్ కింద భారతదేశ యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనా తీరులో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) మే 8, 2023న ల; ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా'ను (పీఎంఎన్ఏఎం) నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 200లకు పైగా జిల్లాల్లో దీనిని నిర్వహిస్తున్నారు. స్థానిక యువతకు సంబంధిత అప్రెంటిస్‌షిప్ శిక్షణ అవకాశాలను అందించడానికి గాను అనేక స్థానిక వ్యాపారాలు, సంస్థలను ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో భాగం కావాలని ఆహ్వానించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పలు కంపెనీలు పాల్గొననున్నాయి. ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా పాల్గొనే సంస్థలు సంభావ్య అప్రెంటిస్‌లతో కనెక్ట్ అవ్వవచ్చు. వారి అర్హతలను అక్కడికక్కడే ఎంచుకోవచ్చు. అదే సమయంలో యువత జీవనోపాధి అవకాశాలను బలోపేతం చేసుకోవచ్చు. ఆసక్తికలిగిన వారు https://www.apprenticeshipindia.gov.in/ ని సందర్శించడం ద్వారా మరియు తమ సమీపంలోని మేళా వివరాలను తెలుసుకోవడం మేళా కోసం నమోదు చేసుకోవచ్చు. 5వ తరగతి నుండి 12వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు లేదా నైపుణ్య శిక్షణ సర్టిఫికెట్లు కలిగి ఉన్నవారు లేదా ఐటీఐ సర్టిఫికేట్ హోల్డర్లు లేదా డిప్లొమా హోల్డర్లు లేదా గ్రాడ్యుయేట్లు ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ రెజ్యూమేల మూడు కాపీలు, అన్ని మార్క్‌షీట్లు మరియు సర్టిఫికేట్‌ల యొక్క మూడు కాపీలు, ఫోటో ఐడీ (ఆధార్ కార్డ్ / డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవి) మరియు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోగ్రాఫ్‌లను సంబంధిత వేదికలకు తీసుకెళ్లాలి. ఈ మేళాకు సంబంధించి వివరాలు అప్రెంటిస్‌షిప్ మేళా పోర్టల్ (http://dgt.gov.in/appmela2022/)??లో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే నమోదు చేసుకున్న వారు అన్ని సంబంధిత పత్రాలతో వేదిక వద్దకు చేరుకోవాలని అధికారులు అభ్యర్థిస్తున్నారు. ఈ మేళా ద్వారా, అభ్యర్థులు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీవీఈటీ) గుర్తింపు పొందిన ధృవపత్రాలను కూడా పొందుతారు, శిక్షణా సెషన్‌ల తర్వాత వారి ఉపాధి రేటును మెరుగుపరుస్తారు.

ప్రధాన్ మంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళాపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అతుల్ కుమార్ తివారీ మాట్లాడుతూ దేశ అభివృద్ధి మరియు వృద్ధిని నడపడానికి, పని ఆధారిత అభ్యాసానికి అవకాశం కల్పించడంలో సహాయపడటానికి అప్రెంటిస్‌షిప్ శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నేర్చుకునేటప్పుడు దాని సంపాదన మోడల్ కింద యువతకు స్టైఫండ్‌తో పాటు ఎక్స్‌పోజర్ అందించబడుతుంది. ఇది అప్రెంటిస్‌ల కోసం పరిశ్రమకు గవాక్షంగా పని చేస్తుంది, ఇక్కడ వారు పరిశ్రమ–ఆధారిత శిక్షణతో పాటు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సర్టిఫికేట్‌ను పొందవచ్చు. ప్రధాన్ మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా అనేది భారతదేశ యువత పరిశ్రమతో అనుసంధానతను అందిచడానికి మరియు సంబంధిత అప్రెంటిస్‌షిప్ శిక్షణ అవకాశాలను పొందేందుకు ఒక సువర్ణావకాశం. దీనికి తోడు ఈ వ్యవస్థ నైపుణ్యం/ అప్‌స్కిల్‌ను కోరుకునే వారికి మరియు వారి కెరీర్‌లో పురోగతిని సాధించేందుకు రూపొందించబడింది.

ప్రతి నెల రెండవ సోమవారం దేశ వ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ మేళాలు నిర్వహిస్తారు. ఈ మేళాలలో, ఎంపిక చేయబడిన వ్యక్తులకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలు అందించబడతాయి, ఈ సమయంలో వారు కొత్త నైపుణ్యాలను పొందేందుకు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా నెలవారీ స్టైఫండ్‌ను అందుకుంటారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అప్రెంటీస్‌షిప్ అత్యంత స్థిరమైన మోడల్‌గా పరిగణించబడుతుంది. స్కిల్ ఇండియా మిషన్‌కు ఇది పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుంది. అప్రెంటిస్‌షిప్ శిక్షణ ద్వారా సంవత్సరానికి 15 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది మరియు ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికి, పీఎంనామ్ అనేది సంస్థలు మరియు యువత భాగస్వామ్యాన్ని పెంచే ఒక చొరవ. భాగస్వామ్య సంస్థల్లో ఉన్న వివిధ అవకాశాలపై యువతకు అవగాహన కల్పిస్తోంది.

# కేసీఆర్ ఎన్నికల వరాలు.. అన్నీ ఇన్నీ కావు ...

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణలో ముచ్చటగా మూడోసారి అధికారం దక్కించుకుని రికార్డు నమోదు చేయాలని భావిస్తున్న భారత రాష్ట్రసమితి అధ్యక్షుడు కేసీఆర్.. దానికి అనుకూలంగా ఇప్పటికే పావులు కదుపుతున్నారు. అసలుఇంకా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనే లేదు. ఇంకా.. షెడ్యూల్ ప్రకటించేందుకు కనీసం నాలుగు మాసాల గడువు కూడా ఉంది. అయితే.. అనూహ్యంగా కేసీఆర్ మాత్రం ప్రజలపై ఎన్నికల వరాలు ప్రకటించేస్తున్నారు. ఒకరకంగా.. చెప్పాలంటే.. ఎన్నికల జల్లు జోరుగా కురిపిస్తున్నారనే చెప్పాలి.ఇటీవల కొత్త సచివాలయం ప్రారంభం సందర్భంగా రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించి కీలకనిర్ణయం తీసుకున్నారు. సుమారు 5 వేల పైచిలుకు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు అనుకూలంగా ఆయన సంతకం పెట్టారు. నిజానికి ఇది ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న విషయం. పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ప్రభుత్వంలోనే కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు దాని ఊసు ఎత్తనే లేదు. అయితే.. అనూహ్యంగా ఎన్నికల ముందు.. వారిపై వరాల జల్లు కురిపించారు.

ఇక మరో కీలక విషయం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలుపెంచుతూ.. నిర్ణయం తీసుకున్నారు. ఇది కూడా ఎన్నికల స్టంటేనని అంటున్నారు పరిశీలకులు. రాష్ట్రంలో మొత్తం 40 వేల పైచిలుకు సంఖ్యలో కార్మికులు ఉన్నారు. వీరిపై ఒకప్పుడు తీవ్రస్థాయిలో ఉక్కుపాదం మోపారు.ముఖ్యంగా జీహెచ్ ఎంసీ పరిధిలో అయితే.. వేతనాలు పెంచాలన్న కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారు. అలాంటి పరిస్థితి నుంచి నేడు.. వారికి వేతనాలు పెంచే పరిస్థితి కి వచ్చారు అంటే.. ఇది ఖచ్చితంగా ఎన్నికల వ్యూహమేనన్నది మేధావుల మాట.

మరోవైపు.. రాష్ట్ర వ్యాప్తంగా దళిత బంధును అమలు చేసే ఫైలుపైనా సీఎం కేసీఆర్ తాజాగా సంతకం చేశారు. వాస్తవానికి గత ఏడాది హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో ఈ పథకాన్ని తెరమీదికి తెచ్చారు. అప్పటికప్పుడు ఆఘమేఘాలపై ఇక్కడ అమలు చేశారు. అయితే.. తర్వాత.. ఆచి తూచి వ్యవహరించారు.మొత్తానికి ఇప్పుడు మళ్లీ దళిత బంధును పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల వ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే అంటున్నారు పరిశీలకు లు. తాజాగా మద్యం సీసాల ధరలు తగ్గించి.. మందుబాబులపైనా వరాల జల్లు కురిపించారు ఇలా మొత్తంగా చూస్తే.. వచ్చే ఎన్నికలు ఖచ్చితంగా కేసీఆర్ను గందరగోళానికి గురి చేస్తున్నాయని అందులో భాగంగానే వరాల జల్లు కురిపిస్తున్నారని అంటున్నారు పరిశీలకులు.

# నేటి నుంచి అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు

తిరుపతి, మే6:తాళ్లపాక అన్నమాచార్యులవారి 615వ జయంతి ఉత్సవాలు నేటి నుంచి 12వ తేదీ వరకు అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగనున్నాయి. ఇందులో భాగంగా నేడు తాళ్లపాకలోని ధ్యానమందిరం వద్ద శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారు.

తాళ్లపాకలో నేటి నుంచి 8వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుండి 8 గంటల వరకు తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.

తిరువతిలోతిరువతిలోని అన్నమాచార్య కళామందిరంలో నేడు సప్తగిరి గోష్టిగానం, సాయంత్రం 6 గంటలకు సంగీత సభ జరగనుంది. మే 7 నుండి 12వ తేదీ వరకు ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సు, సాయంత్రం 6 గంటల నుండి ప్రముఖ విద్వాంసుల గాత్ర, వాద్య, నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# వి.ఓ.చిదంబరనార్ పోర్ట్ వద్ద టుటికోరిన్ నుండి మాల్దీవులకు డైరెక్ట్ షిప్పింగ్ సర్వీస్‌ను ప్రారంభించిన శ్రీ శంతను ఠాకూర్

న్యూఢిల్లీ, మే 6:ఈ రోజు జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖ సహాయ మంత్రి శ్రీ శంతను ఠాకూర్ వి.ఓ.చిదంబరనార్ పోర్ట్ వద్ద టుటికోరిన్ నుండి మాల్దీవులకు డైరెక్ట్ షిప్పింగ్ సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జూన్ 2019లో మాల్దీవులను సందర్శించిన సందర్భంగా భారత ప్రధాన మంత్రి ఢ మాల్దీవుల ప్రెసిడెంట్.. భారత్ మరియు మాల్దీవుల మధ్య కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా మౌలిక సదుపాయాలను ఏర్పరచాలని తద్వారా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యానికి కూడా ప్రోత్సాహాన్ని అందించాల్సిన అవసరాన్ని గురించి ప్రస్తావించారు.

ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లడా నికి మరియు రెండు దేశాల మధ్య పరస్పర అవగాహనను పునరుద్ధాటించడానికి భారత ప్రధాని మాల్దీవుల పర్యటన సందర్భంగా భారత ప్రభుత్వ ఓడరేవు, షిప్పింగ్ ఢ జలమార్గాల మంత్రిత్వ శాఖ మరియు మాల్దీవుల ప్రభుత్వ రవాణా మరియు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ మధ్య సముద్ర ప్రయాణీకుల మరియు కార్గో సేవల స్థాపన కోసం 08.06.2019న సంతకం చేసిన అవగాహన ఒప్పందం మేరకు ఈ సర్వీసు నిర్వహించబడుతోంది. ఇది కూడా 'నైబర్‌హుడ్–ఫస్ట్ పాలసీ' మరియు రీజియన్‌లోని అందరికీ భద్రత మరియు వృద్ధికి సంబంధించిన విజన్‌కి అనుగుణంగా ఉంటుంది.

ఈ 'ఎం.వి.ఎంఎస్ఎస్ గలెనా 'నౌక 421 టీఈయుల కంటైనర్‌లను మోసుకెళ్లే సామర్థ్యం మరియు బల్క్ కార్గోను తీసుకెళ్లే సదుపాయం కలిగిన ఓడ. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా 04.05.2023న పిఎస్ఏ ఎస్ఐసిఏఎల్ కంటైనర్ టెర్మినల్‌కు చేరుకుంది. ఇది పిఎస్ఏ ఎస్ఐసిఏఎల్ కంటైనర్ టెర్మినల్ వద్ద 270 టీఈయుల కంటైనర్‌లతో లోడ్ చేయబడింది. 'ఎం.వి. ఎంఎస్ఎస్ గలెనా' 05.05.2023న టుటికోరిన్ నుండి మాలేకి బయల్దేరింది. ఇది 07.05.2023న మలేకి చేరుకుంటుంది. ఈ షిప్పింగ్ సర్వీస్ రొటేషన్ ట్యూటికోరిన్ మేల్ ట్యూటికోరిన్, మరియు నెలకు 3 సార్లు షెడ్యూల్ చేయబడింది. ఈ సందర్భంగా శ్రీ శంతను ఠాకూర్ మాట్లాడుతూ ఈ చారిత్రాత్మకమైన మరియు మార్గదర్శక సేవను ప్రారంభించడం ద్వారా మన గౌరవనీయులైన ప్రధాన మంత్రి మాల్దీవుల పర్యటన సందర్భంగా చేసిన నిబద్ధత నిశ్చయంగా నెరవేరిందని అన్నారు. ఈ చొరవ లాజిస్టిక్ మరియు ఇతర ఖర్చులను తగ్గించడమే కాకుండా కనెక్టివిటీని మెరుగుపరచడానికి మరియు మన రెండు దేశాల మధ్య వస్తువులను రవాణా చేయడానికి పట్టే సమయాన్ని తగ్గించడానికి కూడా సహాయపడిందన్నారు.

ఈ సేవ (ఐఓఆర్) హిందూ మహాసముద్ర ప్రాంతంలో రెండు దేశాలు చేపట్టిన కనెక్టివిటీ కార్యక్రమాలకు కొత్త అధ్యాయాన్ని జోడించిందని అలాగా భారత్ఢ మాల్దీవుల ఓడరేవుల మధ్య షిప్పింగ్ కనెక్టివిటీని ప్రోత్సహిం చడం,అభివృద్ధి చేయడం, స్థిరీకరించడం జరిగిందని చెప్పారు. ఇది భారతదేశం మరియు మాల్దీవుల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యానికి మరింత ఊపునిస్తుందని తద్వారా మరింత వాణిజ్యం ఢ ఆర్థిక అవకాశాలకు దారి తీస్తుందని తెలిపారు. రెండు దేశాల మధ్య పునరుద్ధరించబడిన శక్తితో సముద్ర వాణిజ్య సంబంధాలను మెరుగుపరుస్తుందన్నారు.

ఇంతకుముందు టుటికోరిన్ నుండి మాల్దీవులకు వెళ్లే భారీ సరుకును బార్జ్‌లు ఢ సెయిల్ షిప్‌ల ద్వారా పంపేవారు మరియు మాల్దీవులకు వెళ్లే కంటైనర్‌లు కొలంబో మీదుగా మళ్లించబడ్డాయి. టుటికోరిన్ – కొచ్చి – కుల్హుదుఫ్ఫుషి – మేల్ మధ్య సర్వీస్ ఎస్‌సిఐ ద్వారా నిర్వహించబడుతుంది. 200 టీఈయు కంటైనర్లు మరియు 3000 టన్నుల సాధారణ కార్గో సామర్థ్యంతో 'ఎంసిపి లింజ్' అనే నౌక 21.09.2020న ప్రారంభించబడింది. ఆ ఒప్పందం 28.08.2022న ముగిసింది.

# ట్రాఫిక్ సిబ్బందికి చలువద్దాలను పంపిణీ చేసిన సీపీ



హన్మకొండ, మే6: (నేటినిజం ప్రతినిధి): వరంగల్ ట్రై సిటి ట్రాఫిక్ పోలీసులకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయము పంపిణీ చేసారు. వేసవి కాలం వేళ మండుతెండలో రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది. ఆరోగ్య దృష్టిలో వుంచుకొని తమ వంతు సహకారాన్ని అందిచాలనే ఆలోచనతో మాజీ శాఫ్ డైరక్టర్ రాజనాల శ్రీహరి వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ సిబ్బందికి చలువద్దాలను అందజేసేం దుకు ముందుకు వచ్చాడు. ఇందులో పోలీస్ కమిషనర్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ట్రాఫిక్ అధికారులు, సిబ్బందికి చలువద్దాలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ సిబ్బంది పనితీరు బాగుందని, రానున్న రోజుల్లో ఇదే తీరును కొనసాగించాలని. వేసవి కాలాన్ని దృష్టి వుంచుకోని ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్య దృష్యా త్వరలో సిబ్బందికి కూల్ కిట్లను అందజేయడం జరుగుతుందని. అలాగే మండుతెండలో విధులు నిర్వహించే సిబ్బంది తగు జాగ్రత్తలను పాటిస్తూ తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమములో ట్రాఫిక్ ఏసిపి మధుసూదన్, వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్లు బాబులాల్, రవికుమార్,రామకృష్ణ, ట్రాఫిక్ శిక్షణా కేంద్రం ఇన్స్‌ట్రక్టర్ విజయ్కుమార్, ట్రాఫిక్ ఎస్.ఐలు రాజేష్, నవీన్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ పాల్గొన్నారు.

# ఏపీలో 50 మంది డీఎస్పీల బదిలీ

అమరావతి, మే 6:ఏపీలో భారీగా డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఇటీవల 77 మంది డీఎస్పీలు బదిలీ చేయగా శనివారం మరో 50 మంది డీఎస్పీలను డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి బదిలీ చేశారు. ఈ మేరకు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఏడాది ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏపీ సర్కార్ కీలక పోస్టింగులలో బదిలీలు చేపట్టింది. వారం క్రితం(ఏప్రిల్ 26)న ఏడుగురు ఐపీఎస్ అధికారులతో సహా 77 మంది డీఎస్పీలను 55 పోలీస్ సబ్ డివిజన్లకు బదిలీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న వారిని బదిలీ చేసి ఆ స్థానాల్లో వేరే వారిని సబ్ డివిజనల్ పోలీస్ అధికారులుగా, ఏసీపీ, ఎస్పీలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా మరో 50 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.




# 2027 నాటికి 67 మొదటి మైలు అనుసంధాన ప్రాజెక్టులను పూర్తి చేయనున్న బొగ్గు ఉత్పత్తి సంస్థలు



న్యూఢిల్లీ, మే 6:బొగ్గు ఉత్పత్తి సంస్థల మొదటి మైలు అనుసంధానత (ఎఫ్ఎంసీ) ప్రాజెక్టుల పురోగతిపై, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఎం.నాగరాజు అధ్యక్షత సమీక్ష జరిగింది. సంవత్సరానికి 885 ఎంటీ బొగ్గును లోడ్ చేయగల సామర్థ్యంతో 67 ఎఫ్ఎంసీ ప్రాజెక్టుల ను (59 ? సీఐఎల్, 5- ఎస్సీసీఎల్ ఉ 3 ? ఎల్సీఐఎల్) బొగ్గు మంత్రిత్వ శాఖ చేపట్టింది. ఈ ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తవుతాయి.

గనుల నుంచి రోడ్డు మార్గంలో బొగ్గు రవాణాను నివారించడానికి, ఎఫ్ఎంసీ ప్రాజెక్టు కింద యాంత్రిక బొగ్గు రవాణా ఉ లోడింగ్ వ్యవస్థను మెరుగుపరచడానికి మంత్రిత్వ శాఖ ఒక ప్రణాళిక రూపొందించింది. క్రషింగ్, బొగ్గు పరిమాణం, కంప్యూటర్ సహాయంతో శీఘ్ర లోడింగ్ వంటివి బొగ్గు నిర్వహణ ప్లాంట్లు (సీహెచ్‌పీలు), శీఘ్ర లోడింగ్ వ్యవస్థతో ఉన్న ప్రయోజనాలు.

మానవ జోక్యం తగ్గించడం, ఖచ్చితమైన ముందస్తు-బరువు పరిమాణం, వేగంగా లోడ్ చేయడం, మెరుగైన బొగ్గు నాణ్యత ఎఫ్ఎంసీ ప్రాజెక్టుల ద్వారా ఒనగూరే ప్రయోజనాలు. లోడింగ్ సమయం తగ్గితే రేక్‌లు, వ్యాగన్‌లు మరింత త్వరగా అందుబాటులోకి వస్తాయి. రోడ్డు మార్గంలో తక్కువ ట్రాఫిక్ వల్ల కాలుష్యం, డీజిల్ వినియోగం తగ్గుతుంది.

బొగ్గు మంత్రిత్వ శాఖ ఎఫ్‌వై25లో 1.3 బిలియన్ టన్నుల బొగ్గును, ఎఫ్‌వై30లో 1.5 బిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశ ఇంధన భద్రతను మెరుగుపరుస్తుంది, దిగుమతి చేసుకునే బొగ్గుకు బదులు దేశీయంగా ఉత్పత్తి చేసిన బొగ్గును భర్తీ చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ సాకారం అవుతుంది. పర్యావరణ అనుకూలమైన, త్వరితగతి, తక్కువ ఖర్చుతో కూడిన బొగ్గు రవాణాను అభివృద్ధి చేయడం లక్ష్యం.

# సెల్‌ఫోన్ వినియోగిస్తున్న ప్రతి నలుగురిలో ముగ్గురు నోమోఫోబియా

## - ఫోన్ లో బ్యాటరీయే కారణం

న్యూఢిల్లీ, మే 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారత్‌లో సెల్‌ఫోన్ వినియోగిస్తున్న ప్రతి నలుగురిలో ముగ్గురు నోమోఫోబియాతో బాధపడుతున్నారని ఒ ప్పో, కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ అధ్యయనంలో వెల్లడైంది. సెల్‌ఫోన్ ఉండదనే ఆందోళనను నోమోఫోబియా(నో మొబైల్ ఫోబి యా) అంటారు. ఈ అధ్యయనం ప్రకారం సెల్‌ఫోన్ బ్యాటరీ 20 శాతం, అంతకంటే తక్కువ ఉంటే 72 శాతం స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఫోన్ ఆగిపోతుందని ఆందోళన చెందుతున్నారు. 65 శాతం మంది వినియోగదారులు ఫోన్ బ్యాటరీ అయిపోతుంటే మానసికంగా అసౌకర్యానికి గురవుతున్నారు. నోమోఫోబియా 31 ? 40 ఏండ్ల వయస్సు ఉన్న వారిలో ఎక్కువగా ఉంటున్నది. ఆ తర్వాత 25 ? 30 ఏండ్ల వయస్సు వారిలో ఉంటున్నది.

# ఏపీ పదో తరగతి ఫలితాలు విడుదల

**-72.26 శాతం మంది ఉత్తీర్ణత**

**-బాలికలే పైచేయి.. బాలురు కంటే అధికంగా 6.11 శాతం బాలికలు పాస్**

విజయవాడ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: ఏపీ పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 6,05,052 మంది విద్యార్థులు హాజరయ్యారు. బాలికలు 2,95,807 మంది.. బాలురు 3,09,245 మంది పరీక్ష రాశారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు జరిగాయి. ఇక ఈ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లిలిలి.తీవబీశ్రీబిబి.ఎబివ.జీబూ.ణవీల.తివి లో అందుబాటులో ఉంచారు. రికార్డు సమయంలో 18 రోజుల్లోనే పది ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది.మొత్తం 72.26 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈసారి కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే అధికంగా 6.11 శాతం బాలికలు పాస్ అయ్యారు.

# పోయిన చోటే వెతుక్కోవాలన్న పొంగులేటి ప్లాన్

## - తెలంగాణ రైతు సమాఖ్య(టీఆర్ఎస్) పేరుతో కొత్త వేదికను సిద్ధం

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పోయిన చోటే వెతుక్కోవాలన్న సామెతను తూచా తప్పకుండా పాటించేలా ప్లాన్ చేస్తున్నారు బీఆర్ఎస్ మాజీ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి. తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి తెర మీదకు తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ (పొట్టిగా పలికితే ఈ పేరు.. వివరంగా చూస్తే తెలంగాణ రాష్ట్ర సమితి) ను మార్చి బీఆర్ఎస్ గా మార్చటం తెలిసిందే. ఈ మధ్యనే బీఆర్ఎస్ నుంచి వేటుపడి బయటకు వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. కేసీఆర్ బాధితులుగా మారిన నేతల్ని ఒక వేదిక మీదకు తీసుకురావటం.. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి.. తర్వాతి కాలంలో అడ్రస్ లేకుండా చేసిన కేసీఆర్ బాధితుల్ని కలిపేందుకు వీలుగా టీఆర్ఎస్ (తెలంగాణ రైతు సమాఖ్య) పేరుతో కొత్త వేదికను సిద్ధం చేస్తున్నారు.

దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్నికల కమిషన్ వద్ద ఒక రాజకీయ పార్టీ నమోదైంది కూడా. దీన్ని పొంగులేటి అనుచరులే రిజిస్టర్ చేయించినట్లు చెబుతున్నారు. ఈ పార్టీని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నాటికి తెర మీదకు తీసుకొచ్చి.. దాదావు 45 స్థానాల్లో తన అనుచరులను బరిలోకి దించేందుకు వీలుగా పొంగులేటి ప్లానింగ్ చేసినట్లుగా చెబుతున్నారు. దీనికి సంబంధించి ఆయన ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారని చెబుతున్నారు.

ఖమ్మం.. మహబూబ్ నగర్.. నల్గొండ.. వరంగల్ జిల్లాలకు చెందిన పలువురిని పార్టీలోకి చేరేందుకు వీలుగా కసరత్తు పూర్తి చేశారంటున్నారు. ఇప్పటివకు పరిమిత సంఖ్యలో మాత్రమే తెలిసిన సరికొత్త టీఆర్ఎస్ ను.. ఓపెన్ గా ప్రకటించేసి.. దానిక స్వరూపం గురించి పొంగులేటి వివరిస్తారని చెబుతున్నారు. మొత్తం 45 స్థానాల్లో పోటీ చేసి 15 స్థానాల్ని సొంతం చేసుకోవటమే తమ లక్ష్యమని పొంగులేటి తన సన్నిహితులతో చెబుతున్నట్లుగా తెలుస్తోంది.

ఈ ప్లాన్ లో భాగంగా కేసీఆర్ బాధితుల్ని ఒక చోటుకు చేర్చాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్ నగర్ జిల్లా ఇన్ ఛార్జిగా మజీ మంత్రి జూపల్లి.. నల్గొండ జిల్లాకు చకిలం అనిల్ కుమార్.. వరంగల్ జిల్లా బాధ్యతను తన వియ్యంకుడైన మాజీ ఎంపి రామ సహాయం సురేందర్ రెడ్డి కొడుక్కి అప్పగించినట్లుగా చెబుతున్నారు. ఉమ్మడి అదిలాబాద్.. కరీంనగర్ జిల్లాలకు సంబంధించి సరైన నేతల కోసం వెతుకులాట సాగుతోంది.

పార్టీ పేరు విషయంలో గులాబీ బాస్ కు షాకిచ్చేలా ప్లాన్ చేసినప్పటికీ.. పార్టీకి కామన్ సింబల్ ను ఎన్నికల కమిషన్ నుంచి పొందటం కష్టంగా ఉంటుందన్న మాట వినిపిస్తోంది. ఐదారు నెలల్లో జరిగే ఎన్నికల్లో పొంగులేటి పార్టీకి కామన్ సింబల్ సమస్యగా మారుతుందన్న మాట వినిపిస్తోంది. కోదండరాం పార్టీ తెలంగాణ జనసమితికి అలాంటి సమస్యే ఎదురైంది. ఈ నేపథ్యంలో కామన్ సింబల్ ను సాధించేందుకు వీలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సంబంధించినకీలక ప్రకటన ఈ నెల 15న తీసుకోనున్నట్లు చెబుతున్నారు. ఏమైనా.. తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన టీఆర్ఎస్ పేరును వదిలేయటం ద్వారా తనకు ఎంత నష్టం వాటిల్లిందన్న విషయాన్ని కేసీఆర్ కు అర్థమయ్యేలా చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు చెబుతున్నారు. మరీ ప్లానింగ్ ఎంతవరకు వర్కువుట్ అవుతుందో తేలాలంటే మరికొంత కాలం వెయిట్ చేయక తప్పదు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ అభ్యర్థులు విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా పెద్ద యెత్తున్న నినాదాలు ఇచ్చారు. టీచర్ పోస్టులు భర్తీ చేసే వరకు కూడా ఉద్యమాన్ని కొనసాగిస్తాం అని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ ముట్టడి తెలంగాణ జాక్ ఛైర్మన్ నీల వెంకటేష్ నాయకత్వం వహించారు.

నిరుద్యోగులు పెద్ద యెత్తున రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాటశాలల్లో 24 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు, ఎయిడెడ్ పాటశాలల్లో 4900 టీచర్ పోస్టులు, ఆదర్శ పాటశాలల్లో 2000, కస్తుర్బా పాటశాలల్లో 1200 టీచర్ పోస్టులుఖాళీగా ఉన్నవి. ఇవిగాక ప్రభుత్వ పాటశాలల్లో 4 వేల కంప్యూటర్ టీచర్ పోస్టులు, 10 వేల పి.ఇ.టి. పోస్టులు, 5 వేల ఆర్ట్, క్రాఫ్ట్ ఉ డ్రాయింగ్ పోస్టులు, 3 వేల లైబ్రేరియన్ పోస్టులు, 4 వేల జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 10 వేల అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నవి.

ఇంత పెద్దఎత్తున ఖాళీగా ఉంటె భర్తీ చేయకుండా ఇటు విద్యార్థుల భవిష్యత్ అటు నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమంలో నీల వెంకటేష్, గూడూరు నాని అంజి, అనంతయ్య, భూపేష్ సాగర్, నిఖిల్ పటేల్, ప్రభాకర్ రెడ్డి, , రాందేవ్ మోడి తదితరులు పాల్గొన్నారు.

# రాజీనామా ఉపసంహరించుకున్నా మళ్లీ మొదటికొచ్చిన వివాదం

ముంబై మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఎన్సీపీ అధినేత పదవికి ఇటీవల చేసిన రాజీనామాను శరద్ పవార్ ఉపసంహరించుకున్నారు. అయితే వివాదం మాత్రం సద్దుమణగలేదు. రాజీనామా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించేందుకు ముంబైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నేత, పవార్ సమీప బంధువు అజిత్ పవార్ లేరు. దీంతో మళ్లీ ఊహాగానాలు మొదలయ్యాయి. పార్టీలో జరుగుతున్న అనూహ్య పరిణామాల వల్లే శరద్ పవార్ రాజీనామా చేశారని పుకార్లు షికారు చేశాయి. ఆ తర్వాత పెద్ద ఎత్తున ఎన్సీపీ కార్యకర్తలు, నాయకులు ఆందోళనలు చేయడంతో పెద్దాయన మెత్తబడ్డారు. రాజీనామా ఉపసంహరించుకున్నారు. అయితే తన రాజీనామా ఉపసంహరణ విషయాన్ని చెప్పటానికి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అజిత్ పవార్ లేకపోవడంపై కొత్త కథనాలు మొదలయ్యాయి. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చినట్లైంది.

వాస్తవానికి బీజేపీ-ఎన్సీపీ సంకీర్ణ సర్కారు ఏర్పాటు కాబోతోందని, అజిత్ పవార్ ముఖ్యమంత్రి అయ్యేందుకు అవకాశముందని ఇటీవలే వార్తలు వచ్చాయి. అజిత్ పవార్ ఒక్కడే వెళ్లడం కాకుండా తనతో పాటు మెజార్టీ ఎన్సీపీ ఎమ్మెల్యేలను వెంటబెట్టుకుపోవాలని నిర్ణయించినట్లు కథనాలు వెలువడ్డాయి. దీనిపై శరద్ పవార్ నొచ్చుకున్నట్లు అందుకే రాజీనామా చేసినట్లు జాతీయమీడియాలో కథనాలు ప్రసారమయ్యాయి. అయితే రాజీనామాను వెనక్కు తీసుకోవాలని స్వయంగా అజిత్ పవార్ కోరడం కొసమెరుపుగా మారింది. అయితే ఆయన మళ్లీ విలేకరుల సమావేశంలో లేకపోవడంతో మీడియా కథనాలకు బలం ఏర్పడింది.

ఏక్‌నాథ్ షిండే? ఉద్ధవ్ ఠాక్రే వర్గాల్లో అసలైన శివసేన ఎవరిదనే విషయంపై సుప్రీంకోర్టు తన తీర్పును మార్చి 16న రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. త్వరలో ఈ తీర్పు ఫలితం వచ్చే అవకాశాలున్నాయి, ఒక వేళ షిండే వర్గం ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేసినా, యథాతథ స్థితి పునరుద్ధరించాలని చెప్పినా షిండే రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతలు అజిత్ పవార్‌తో సంప్రదింపులు జరుపుతున్నారనే వార్తలు కొద్దిరోజులుగా జోరుగా వినిపిస్తున్నాయి. కమలనాథులతో కలిసి అధికారం చేపట్టే అవకాశం ఉన్నప్పుడు చేజేతులా ఆ అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని మెజారిటీ ఎన్సీపీ ఎమ్మెల్యేలు భావిస్తుండడంతో శరద్ పవార్ తప్పని పరిస్థితుల్లోనే రాజీనామా నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే, తాను అధ్యక్షుడుగా ఉండగా పార్టీ బీజేపీతో చేతులు కలిపిందన్న అభిప్రాయం రాకుండా ఉండేందుకే ఆయన రాజీనామా నిర్ణయం తీసుకున్నారని పరిశీలకులు భావిస్తున్నారు.

తన రాజీనామా ద్వారా ఎన్సీపీ ఎమ్మెల్యేలెవ్వరూ అజిత్ పవార్‌తో వెళ్లొద్దని శరద్ పవార్ చెప్పి ఉంటారని, తామెవ్వరమూ వెళ్లడం లేదని వారంతా చెప్పాకే పెద్దాయన రాజీనామా ఉపసంహరించుకుని ఉంటారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సీఎం కుర్చీపై కన్నేసిన అజిత్ పవార్ మనసులో ప్రస్తుతం ఏం మెదలుతుందో అంచనావేయడం కష్టమేనంటున్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో ఎన్సీపీ రాజకీయాలు మరో మలుపు తీసుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదంటున్నారు.

# ఈ నెల 28 న పల్నాడులో బిసి ల ఆత్మీయ సమ్మేళనం

హైదరాబాద్, మే6:బిసి రాజ్యాధికార సాధికారికత సాదన లక్ష్యం దిశగా ఈ నెల 28 న పల్నాడు జిల్లాలో బిసి ల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర యువత అధ్యక్షులు గూడూరు నాని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ఆత్మీయ అతిధులుగా జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య,వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.రాజ్యాధికారం ద్వారనే బిసిల అభివృద్ధి సాధ్యమన్నారు.బిసిలకు రాజ్యాధికారం దక్కాలంటే బిసి జనగణన జరుపాలని, పార్లమెంట్లో బిసి బిల్లు పెట్టి ఆమోదం తెలిపి జనాబా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని, నాని డిమాండ్ చేసారు.ఉద్యోగాలలో కుడా బిసిలకు అన్యాయం జరుగుతుందని, బిసి ఉద్యోగులలకు ప్రమోషన్లలో రిజర్వేషన్స్ అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.ఈ ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా వ్యాప్తంగా గల బిసి లు బిసి సంఘాల నేతలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని గూడూరు నాని పిలుపునిచ్చారు.

# మే 9 న సిట్వే పోర్టులో మొట్టమొదటి భారతీయ కార్గో షిప్ డాకింగ్ ను అందుకోనున్న శ్రీ సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, మే 6:కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ , జలమార్గాలు, ఆయుష్ శాఖల మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ 2023 మే 9 న మయన్మార్ లోని సిట్వే పోర్ట్ వద్ద మొదటి భారతీయ సరుకు రవాణా నౌకను అందుకోనున్నారు. భారతదేశంలోని కోల్‌కతా శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్ట్ నుండి మయన్మార్ రఖైన్ రాష్ట్రంలోని సిట్వే పోర్టుకు సరుకు రవాణా నౌకల సాధారణ రవాణాను ఈ సందర్భంగా ప్రారంభించే అవకాశం ఉంది, ఇది రెండు దేశాల మధ్య రవాణాలో కొత్త యుగానికి నాంది పలుకుతుంది.

ఈ మార్గం మొత్తం బంగాళాఖాతం ద్వీపకల్పానికి అద్భుతమైన ఆర్థిక సామర్థ్యాన్ని తెరిచే అవకాశం ఉందని, దక్షిణాసియా , ఆగ్నేయాసియా ప్రాంతాల మధ్య వారధిని అనుమతిస్తుందని శ్రీ సోనోవాల్ అస్సాంలోని దిబ్రూగఢ్ లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ, “ప్రధాన మంత్రి శ్రీనరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఈశాన్య ప్రాంతం భారతదేశ అభివృద్ధి ఎజెండాలో ముందంజలో ఉంది. భూపరివేష్టిత ఈశాన్య భారతదేశానికి అంతిమంగా అంతర్జాతీయ సముద్ర మార్గంలో చాలా తక్కువ ప్రవేశం లభించినప్పుడు, నరేంద్ర మోదీ దార్శనిక 'యాక్ట్ ఈస్ట్' విధానం లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు. ఈశాన్య ప్రాంత పురోగతి , ప్రగతి పట్ల మోదీజీ నిబద్ధత కారణంగా, రాబోయే సంవత్సరాల్లో ఈశాన్య భారతదేశ వాణిజ్య అవకాశాలను పెంచే లక్ష్యంతో మయన్మార్ లోని సిట్వే నౌకాశ్రయాన్ని త్వరితగతిన అమలు చేయడంలో మేము ముందుకు సాగగలిగాము. ఈశాన్య భారతదేశంతో పాటు, ఈ నౌకాశ్రయం ఆగ్నేయాసియాతో వారధిగా పనిచేయడం ద్వారా భారతదేశం, మయన్మార్ తో పాటు బంగ్లాదేశ్, భూటాన్ , నేపాల్ కు కూడా భారీ వాణిజ్య అవకాశాలను తెరుస్తుంది. మోదీ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' సిద్ధాంతాన్ని అమలు చేయడానికి ఇదే నిదర్శనం' అన్నారు.

సిట్వే ఓడరేవు అభివృద్ధి కలదాన్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్ పోర్ట్ ప్రాజెక్ట్ (కెఎంటిటిపి) లో భాగం. సిట్వే పోర్ట్ అందుబాటులోకి వస్తే ఆగ్నేయాసియాతో మల్టీ మోడల్ ట్రాన్సిట్ కనెక్టివిటీకి వీలవుతుంది. మయన్మార్ లోని సిట్వే ఓడరేవును భారతదేశంలోని మిజోరాం రాష్ట్రంతో కలుపుతూ కలదాన్ నదిపై మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్ పోర్ట్ ఫెసిలిటీ నిర్మాణం, నిర్వహణ కోసం భారతదేశం - మయన్మార్ మధ్య ఒక ఫ్రేమ్ వర్క్ ఒప్పందం కింద సిట్వే పోర్ట్ ను అభివృద్ధి చేశారు.

ఈశాన్య భారతంతో అనుసంధానం మయన్మార్ లోని పాలెట్వా నుంచి మిజోరంలోని జోరిన్‌పుయి వరకు: సిట్వే నౌకాశ్రయం మయన్మార్ లోని పాలెట్వా ను అంతర్గత జలమార్గం ద్వారా, పాలెట్వా నుంచి మిజోరంలోని జోరిన్‌పుయ్ ను రోడ్డు మార్గం ద్వారా కలుపుతుంది.

మయన్మార్ లోని సిట్వే నుంచి త్రిపురలోని సర్ బూమ్ కు: కోల్ కతా నుంచి సిట్వే పోర్టుకు సరుకులను కేవలం 60 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న బంగ్లాదేశ్ లోని టెక్నాఫ్ పోర్టుకు రవాణా చేయవచ్చు. టెక్నాఫ్ పోర్టు నుండి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న సబ్రూమ్ కు రోడ్డు మార్గం ద్వారా సరుకులను రవాణా చేయవచ్చు.

సబ్రూమ్ బంగ్లాదేశ్, త్రిపురల మధ్య ఇంటిగ్రేటెడ్ కస్టమ్స్ సరిహద్దును కలిగి ఉంది. రవాణా సమయం , లాజిస్టిక్ ఖర్చును గణనీయంగా తగ్గించడం ద్వారా సిట్వే పోర్ట్ , కలదాన్ ప్రాజెక్ట్ త్రిపురకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.

శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ, “కలదాన్ మల్టీ మోడల్ ట్రాన్స్ పోర్ట్ టిపి పూర్తిగా అమలులోకి వచ్చిన తర్వాత, సిట్వే నౌకాశ్రయం ద్వారా భారతదేశ తూర్పు తీరం నుండి ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యామ్నాయ కనెక్టివిటీని అందిస్తుంది.

సిలిగురి నుండి కోల్‌కతాకు ప్రస్తుతం ఉన్న మార్గం కంటే ఈశాన్య భారతదేశ వాణిజ్యం , వర్తకానికి ఇది చాలా ఆచరణీయమైన మార్గం, సమయం, డబ్బు , అద్భుతమైన సామర్థ్యాన్ని ఆదా చేస్తుంది.

కోల్‌కతా నుండి ఐజ్వాల్ కు సరుకుల రవాణా ఖర్చు 50% పైగా తగ్గింది, సరుకును కోల్‌కతా నుండి సిట్వేకు పాలెట్వాకు ,ఆ తరువాత రోడ్డు ద్వారా ఐజ్వాల్ ,మొత్తం ఈశాన్య భారతదేశానికి పంపినప్పుడు ఖర్చు, సమయం తగ్గింది. అదేవిధంగా, కోల్‌కతా నుండి అగర్తలాకు ఈ మార్గం ద్వారా సరుకులు పంపేందుకు చాలా తక్కువ ఖర్చు , నమయం సరిపోతుంది. కోల్కతా నుండి అగర్తలా వరకు రహదారి పొడవు సుమారు 1600 కిలోమీటర్లు. రహదారి మార్గాల ద్వారా 4 రోజులు పడుతుంది, సిట్వే నుండి చిట్టగాంగ్, సబ్రూమ్ నుండి అగర్తలా వరకు 2 రోజుల్లో పూర్తవుతుంది, ఇది ఖర్చు , సమయాన్ని కూడా ఆదా చేస్తుంది. రహదారిపై ట్రాఫిక్ ను తగ్గించడంతో పాటు, సముద్ర రవాణాను ఉపయోగించడం వల్ల శిలాజ ఇంధన కర్బన ఉద్గారాలు తగ్గడంతో రవాణా పర్యావరణ ఖర్చు గణనీయంగా తగ్గుతుంది.

ఇది ఆర్థికంగానే కాకుండా పర్యావరణపరంగా కూడా మనకు ఉపయోగపడే అద్భుతమైన విషయం.

సిట్వే పోర్టుకు ఎగుమతికి ప్రధాన సరుకు; అనగా మయన్మార్ నుండి ఎగుమతులలో బియ్యం, కలప, చేపలు ,సీఫుడ్, పెట్రోలియం ఉత్పత్తులు , దుస్తులు, వస్త్రాలు ఉన్నాయి. సిట్వే పోర్ట్ కు దిగుమతి కోసం ప్రధాన సరుకు; అంటే మయన్మార్ దిగుమతుల్లో సిమెంట్, స్టీల్, ఇటుకలు వంటి నిర్మాణ సామగ్రి ఉన్నాయి.

మయన్మార్ లోని సిట్వే ఓడరేవును భారతదేశంలోని మిజోరాం రాష్ట్రంతో కలుపుతూ కలదాన్ నదిపై మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్ పోర్ట్ ఫెసిలిటీ నిర్మాణం, నిర్వహణ కోసం భారతదేశం ,మయన్మార్ మధ్య ఒక ఫ్రేమ్ వర్క్ ఒప్పందం కింద సిట్వే పోర్ట్ ను అభివృద్ధి చేశారు. ఈ నౌకాశ్రయం భారతదేశ ఈశాన్య రాష్ట్రాలకు కొత్త అవకాశాలను తెరుస్తుంది, ఎందుకంటే ఇది వాణిజ్యం, రవాణా కోసం ప్రత్యామ్నాయ ,మరింత ఆచరణీయమైన మార్గాన్ని ఉపయోగించగలదు. ఇంకా మయన్మార్. కు , ముఖ్యంగా రఖైన్ రాష్ట్రానికి, రెండు దేశాలు , విస్తృత ప్రాంతం మధ్య వ్యాపార, వాణిజ్యాన్ని మరింత మెరుగుపరుస్తుంది.

# మిషన్ లైఫ్‌పై ప్రత్యేక దృష్టితో ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2023 వేడుకలు

న్యూఢిల్లీ, మే 6:పర్యావరణం గురించి అవగాహన, చర్యల కోసం దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలను ఒక దగ్గరకు చేర్చే సందర్భం ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5). ఈ ఏడాది మిషన్ లైఫ్ పై దృష్టితో ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2023ను జరపాలని భారత పర్యావరణ, అడవులు, పర్యావరణ మార్పు భావించింది.

సుస్థిరమైన జీవన శైలిని, ఆచరణలను అందిపుచ్చుకోవాలన్న ప్రపంచ కృషిని పునరుజ్జీవింపచేయాలని స్పష్టమైన పిలుపిస్తూ లైఫ్ (ఒతిఈఇ) అంటే పర్యావరణం కోసం జీవనశైలి అన్న భావనను 2021 యుఎన్ఎఫ్‌సిసిసి సిఒపి 26 ప్రపంచ నాయకుల సదస్సుకు ప్రధాన మంత్రి ప్రవేశపెటారు. ఈ వేడుకలకు ముందుగా లైఫ్ పై దేశవ్యాప్తంగా భారీ జన సమీకరణను నిర్వహిస్తున్నారు.

నేషనల్ మ్యూజియం ఆఫ్ నాచురల్ హిస్టరీ (ఎన్ఎంఎన్‌హెచ్)

నేషనల్ జీలాజికల్ పార్క్ సమన్వయంతో నేషనల్ మ్యూజియం ఆఫ్ నాచురల్ హిస్టరీ ప్రజలలో ప్రవర్తనా మార్పులను తీసుకువడానికి మిషన్ లైఫ్ పై వ్యర్థాల తగ్గింపు (స్వచ్ఛత చర్యలు) కోసం ప్రజల సమీకరణను ప్రారంభించింది. ఇందులో ఘజియాబాద్‌లోని కెఐఇటి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మీనాక్షీ కారావాల్ వ్యర్థాల నిర్వహణపై పిపిటి, ప్రదర్శన, ముఖాముఖి సెషన్‌ను నిర్వహించారు. ఇందులో పాల్గొన్నవారంతా కూడా లైఫ్ చర్యలను అవలంబిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఎన్ఎంఎన్‌హెచ్ ప్రాంతీయ కార్యాలయాల కార్యక్రమాలుః

ఆర్ఎంఎన్‌హెచ్, మైసూర్- ఎన్ఎంఎన్‌హెచ్- ఎంఒఇఎఫ్‌సిసి 05-05-2023న మిషన్ లైఫ్ (పర్యావరణం కోసం జీవనశైలి)లో భాగంగా విద్యార్థులు, సాధారణ ప్రజలకు మాస్క్ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించి, హరిత ప్రతిజ్ఞతో పాటుగా పర్యావరణ అనుకూల జీవనశైలి అవలంబించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు.

ఆర్‌జిఆర్ఎంఎన్‌హెచ్, సవాయ్ మాధోపూర్- ఏ ఎన్ఎంఎన్‌హెచ్ ఇండియాఏఎంఒఇఎఫ్‌సిసిలు చ మిషన్ లైఫ్‌పై ఓరియంటేషన్ (నిర్దేశ) కార్యక్రమాన్ని, జల కాలుష్యంపై హరిత ఉపన్యాసం, నీటి పొదుపు, సముద్ర పర్యావరణ వ్యవస్థ, పర్యావరణ మార్పు ప్రాముఖ్యతపై ప్రసంగాలను నిర్వహించాయి. సుమారు 478మంది విద్యార్థులు, సందర్శకులు, సాధారణ ప్రజలు నీటి పొదుపు, సముద్ర పర్యావరణః సముద్ర జీవనం, పర్యావరణ మార్పుః వినోదంగా నేర్చుకోండి అన్న అంశాలపై ప్రదర్శనలో చురుకుగా పాల్గొనడమే కాక, ఫిల్మ్ షోలను ఉ సెల్ఫీ కార్నర్‌ను ఆస్వాదించారు.

జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ)

నీటి పొదుపు, ప్లాస్టిక్‌కు నో చెప్పండి అన్నమిషన్ లైఫ్ అంశాలపై యువతలో అవగాహనను పెంచేందుకు జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రజా సమీకరణను ప్రారంభించింది. జెడ్ఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ ధృతి బెనర్జీ దృశ్య మాధ్యమం ద్వారా సుమారు 100 మంది యువతకు, పాల్గొన్న ఔత్సాహిక యువతను ఉద్దేశించి ప్రసంగించారు.

నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సిఎస్‌సిఎం - జాతీయ సుస్థిర తీర నిర్వహణ కేంద్రం)

లైఫ్ ఆచరణలకు సంబంధించి హరిత ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ ద్వారా నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సిఎస్‌సిఎం), చెన్నై మిషన్ లైఫ్ కోసం ప్రజల సమీకరణను శుక్రవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమం వరల్డ్ బ్యాంక్ తీరప్రాంత, వ్యవసాయ, పట్టణ స్థితిస్థాపకత, మముందస్తు హెచ్చరిక కోసం హైడ్రోమెట్ సేవ అన్న వర్క్‌షాప్‌లో భాగంగా నిర్వహించారు. తీర ప్రాంత స్థితిస్థాపకతకు సంబంధించి ఉత్తమ ఆచరణలను అభ్యసించడం దీని లక్ష్యం. ఈ వర్క్‌షాప్‌లో బాంగ్లాదేశ్, శ్రీలంక ప్రభుత్వాల ప్రతినిధులు పాల్గొని తీర ప్రాంత నిర్వహణ, సుస్థిర వ్యవసాయ ఆచరణల గురించి తమ అనుభవాలను పంచుకున్నారు. పర్యావరణ స్థితిస్థాపకత కలిగిన తీర సమాజాన్ని నిర్మించేందుకు తీరప్రాంత పర్యావరణ కోసం నిలకడైన జీవనశైలుల ఆవశ్యకతను ఎన్‌సిఎస్‌సిఎం డైరెక్టర్ తన ప్రారంభోపన్యాసంలో నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులలో తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, కోయంబత్తూర్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. గీతా లక్ష్మి, సిఎస్ఐఆర్- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ గోవా ప్రొఫెసర్ సునీల్ కుమార్ సింగ్, చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త-జి, అధిపతి డాక్టర్ ఎస్ బాలచంద్రన్, కేరళలోని బిఐడిఆర్ఒసి కు చెందిన డాక్టర్ అన్నీ జార్జ్ కూడా ఉన్నారు.

హరిత ప్రతిజ్ఞలో, వ్యర్థాలకు వ్యతిరేకంగా, ప్రకృతికి అనుగుణంగా జీవించాల్సిన అవసరంపై సంతకాల సేకరణ ప్రచారంలో భాగస్వాములందరూ పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు ప్రైవేట్ సెక్రటరీగా శరద్ మర్కడ్ బాబాసాహెబ్

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రాజకీయ పార్టీలే ప్రభుత్వాలను ఏర్పాటు చేసి నడిపిస్తున్నా పార్టీ వ్యవహారాలు, గవర్నమెంట్ కార్యకలాపాలు వేర్వేరు. అధికారం చేతుల్లో ఉంది కదా అని పార్టీ ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని ఉపయోగించుకోవడానికి వీల్లేదు. మరి సీఎం కేసీఆర్ సారధ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటివల చేపట్టిన ఓ నియామకం విషయంలో పార్టీ కోసం ప్రభుత్వాన్ని ఉపయోగించుకున్నారా? అనే సందేహాలకు, విమర్శలకు తావిచ్చింది ఓ పరిణామం. ఇలా చేయడం సబబేనా? అనే ప్రశ్నలకు కారణమవుతోంది. “ తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రైవేట్ సెక్రటరీగా శరద్ మర్కడ్ బాబా సాహెబ్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్లకాలానికి జరిగిన ఈ నియామకం 1 మే 2023 నుంచి అమల్లోకి వచ్చింది. అతడికి నెలకు రూ. 1,50,000 వేతనం చెల్లించబడుతుంది. ఈ వ్యయం జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి చెల్లించబడుతుంది” అని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వు వెలువరించింది. సంబంధిత శాఖకు, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌కు విషయాన్ని తెలియజేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి 2 మే 2023న ఈ సర్క్యులర్ జారీ చేశారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా.. కేసీఆర్ ప్రైవేటు సెక్రటరీగా నియామకమైన వ్యక్తి శరద మర్కడ్ బాబాసాహెబ్ విషయంలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కారణం ఏంటా అని ఆరా తీస్తే ఆసక్తికర విషయాలు తెలిశాయి.

సీఎం కేసీఆర్‌కు ప్రైవేట్ సెక్రటరీగా నియమితుడైన శరద్ మర్కడ్ బాబాసాహెబ్.. మహారాష్ట్రలోని అహ్మద్ నగర్‌కు చెందిన వ్యక్తి. ఏప్రిల్ 10న బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంటే బీఆర్ఎస్‌లో చేరిన 20 రోజులకే ప్రైవేటు సెక్రటరీగా అతడి నియామకం జరిగింది. దీంతో పార్టీ చేరిలో చేరిన వ్యక్తికి సీఎంవోలో ఉద్యోగం వచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కోసం ప్రభుత్వాన్ని ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తరపున నియమించుకొని పార్టీ వ్యవహారాలకు వాడుకుంటారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియామకంపై టీపీసీసీ రేవంత్ రెడ్డి కూడా ఘాటుగానే స్పందించారు. పక్క రాష్ట్రంలో పరపతి కోసం ఇక్కడ ఉద్యోగం ఇచ్చారని, రాష్ట్రానికి చెందిన యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదుగానీ పొరుగు రాష్ట్రాలవారికి ఉద్యోగాలు ఇస్తున్నారని మండిపడ్డారు.

కాగా మహారాష్ట్రకు చెందిన శరద్ మర్కడ్ బాబాసాహెబ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకొని మరీ బీఆర్ఎస్ లో చేరారని బీఆర్ఎస్ అనుకూల మీడియాలో వార్తలు వచ్చాయి. రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన శరద్ మర్కడ్.. రైతుల దోపిడిని చూస్తూ పెరిగారని, కేసీఆర్ విధానాలు నచ్చి బీఆర్ఎస్‌లో చేరినట్టు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా మహారాష్ట్రలో పార్టీని క్రియాశీలకంగా మార్చాలని బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ భావిస్తున్నారు. ఇప్పటికే అక్కడ పలు మీటింగ్‌లు ఏర్పాటు చేయడం తోపాటు పార్టీలో చేరికలను ప్రోత్సహి స్తున్నారు. అన్ని విధాలా అక్కడి జనా లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే పార్టీలో చేరిన మహారాష్ట్ర వ్యక్తికి సీఎంవోలో ఉద్యోగం వచ్చిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ విమర్శలకు బీఆర్ఎస్ ఎలాంటి సమాధానం చెబుతుందో వేచిచూడాలి.

# పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థిని,విద్యార్థులకు అవసరమయ్యే అన్ని పుస్తకాలను, డిజిటలైజ్ చేసిన సమాచారాన్ని అన్ని గ్రంథాలయాలలో ఉంచుతాం

మెదక్, మే6: (నేటినిజం ప్రతినిధి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థిని,విద్యార్థులకు అవసరమయ్యే అన్ని పుస్తకాలను, డిజిటలైజ్ చేసిన సమాచారాన్ని కంప్యూటర్ సిస్టమ్స్ ద్వారా అన్ని గ్రంథాలయాలలో ఉంచుతున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు చంద్రా గౌడ్ అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ పాఠకుల అభిరుచి మేరకు మెదక్ పట్టణ కేంద్రంలో రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో అన్ని హంగులతో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ భవనం జులై నెలాఖరునాటికి పూర్తవుతుందని అన్నారు. ప్రస్తుతం రోజు 150 మంది వరకు యువత గ్రంథాలయానికి వస్తున్నారని, వారి అవసరాలకను గుణంగా నూతనంగా నిర్మించే భవనంలో పురుషులు, స్త్రీలు, పిల్లలు, పెద్దలకు విడివిడిగా కూర్చుని పఠనం చేసే విధంగా రూపుదిద్దుతున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ల కృషివల్ల గత సంవత్సరం కోటి 23 లక్షల గ్రంథాలయ సెస్ రావడంతో గ్రంథాలయాల అభివృద్ధి, పటిష్ఠతకు కృషి చేస్తున్నామని, జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి నిధులు వెచ్చిస్తున్నామని అన్నారు. నరసాపూర్ లో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, ఎలక్ట్రిఫికేషన్, ఫ్లోరింగ్ వంటి పనులు త్వరలో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయనున్నామని అన్నారు. వెల్దుర్తి లో 22 లక్షల 50 వేల ఖర్చుతో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించనున్నామన్నారు. పాఠకులను ఆకర్షించే విధంగా జిల్లాలోని 15 శాఖ గ్రంథాలయాలను మరమ్మతులు చేయడంతో పాటు ఆకర్షణీయంగా రంగులతో తీర్చిదిద్దుటకు ఒక్కో శాఖ గ్రంథాలయానికి 20 వేలు అందజేస్తున్నామని అన్నారు. అదేవిధంగా 40 లక్షలతో ఫర్నీచర్ ఏర్పాటు చేస్తున్నామని, 10 లక్షలతో నూతన పుస్కకాలు, 5 లక్షలతో కంప్యూటర్లు కొనుగోలు చేసి అందజేయనున్నామని చంద్ర గౌడ్ తెలిపారు. ప్రస్తుతం స్వీపర్లకు ఇస్తున్న గౌరవ వేతనం 2 వేల నుండి 5 వేలకు పెంచుతున్నామని అన్నారు. ఏ గ్రామ పంచాయితీలో అయినా గ్రంథాలయం కావాలన్నా రీడింగ్ రూమ్స్ ఇచ్చి అవసరమున్న పుస్తకాలు అందజేస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి కోటి 25 లక్షలు, ఫర్నీచర్,పుస్తకాలు, కంప్యూటర్ల కొనుగోలు, శాఖా గ్రంథాలయాల భవనాల మరమ్మత్తులు, పెయింటింగ్స్, స్వీపర్ల వేతనాల పెంపుపై ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ ఆమోదించిందని చంద్ర గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీ, సభ్యులు పాదాల సిద్దిరాములు, డీఈఓ రాధాకిషన్, వయోజన విద్య ఉప సంచాలకులు, సంస్థ సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, డీపీఆర్ ఓ శాంతి కుమార్ పాల్గొన్నారు.

# తీవ్ర భావోద్వేగానికి లోనై కంట తడిపెట్టిన బాలినేని..

అమరావతి మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఏపీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీలో సంచలనాలకు కేరాఫ్ గా తయారయ్యారు. ఈ మధ్య ఎక్కడ చూసినా.. ఎవరినోట విన్నా బాలినేని.. బాలినేని అనే వస్తోంది. తనకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రాధాన్యత తగ్గించారని.. అది కూడా వైసీపీ నేతలు ఈ పనిచేస్తున్నారని తీవ్ర అసంతృప్తితో అధిష్ఠానం తనకిచ్చిన రీజనల్ కో–ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేయడం పెను సంచలనమే అయ్యింది. ఆ తర్వాత బాలినేని ఫోన్ కాల్ కు, నియోజకవర్గంలో కూడా అందుబాటులో లేకుండా హైదరాబాద్ లోనే వారం రోజులపాటు ఉండిపోయారు. పార్టీ ముఖ్యనేతలతో జగన్ మాట్లాడించినా వర్కవుట్ అవ్వకపోవడంతో ఇక డైరెక్టుగా సీఎం రంగంలోకి దిగి తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసుకు రప్పించుకున్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బాలినేని ఇద్దర్నీ కూర్చోబెట్టి 45 నిమిషాలకు పైగా బుజ్జగించినా ఫలితం లేకపోయింది. ఆఖరికి తీవ్ర అసంతృప్తితోనే సమావేశం నుంచి బయటికొచ్చారు. అక్కడ్నుంచి నేరుగా మీడియా కంట పడకుండానే హైదరాబాద్ వెళ్లిపోయారు. భాగ్యనగరం నుంచి ఒంగోలుకు వెళ్లిన బాలినేని అనూహ్యంగా మరో బాంబ్ పేల్చారు. ఈసారి బాలినేని చేసిన కామెంట్స్ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యాయి. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 'నాకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ భిక్ష పెట్టారు. 1999 లో నేను రాజకీయాల్లోకి వచ్చాను. 2009లో వైఎస్సార్ మంత్రి పదవి ఇచ్చారు. వైఎస్సార్ మరణం నా రాజకీయ జీవితంలో తీరని లోటు. జగన్ ఓదార్పు యాత్ర సమయంలో మంత్రి పదవి తీస్తామని చెప్పినా లెక్క చెయ్యలేదు. జగన్ వెంటే నేను నడిచాను. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కీలక నేతగా పని చేశాను. ఈ మధ్య చెన్నై హవాలా , భూ కబ్జాలు, సినిమాలో పెట్టుబడులు అని నాపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ కోసం ఎంతో శ్రమించా.. ఎన్నో అవమానాలు పడ్డాను. కానీ నాపై నిందలు, ఆరోపణలను భరించలేకపోతున్నా' అని బాలినేని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 'నేను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. గోనె ప్రకాశ్ కు నా గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముంది?. గోనెతో కావాలనే కొందరు మాట్లాడిస్తున్నట్లు ఉంది. వైవీ సుబ్బారెడ్డి, అతని భార్యను పొగిడిన గోనె.. జగన్, భారతిని విమర్శిస్తున్నారు. రాజకీయాల్లో విశ్వసనీయత ఉండాలి' అని బాలినేని చెప్పుకొచ్చారు.

ఇంతకీ గోనె ఏమన్నారు..?

వాస్తవానికి గత కొన్నిరోజులు బాలినేని పార్టీ మారుతున్నట్లు పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. సరిగ్గా ఇదే టైమ్ లో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు మీడియా ముందుకొచ్చి బాలినేని గురించి మాట్లాడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. బాలినేనికి వందల కోట్లు ఎలా వచ్చాయి..? విదేశాల్లో గ్యాంబ్లింగ్ లు ఆడిన చరిత్ర బాలినేనిదని గోనే చెప్పుకొచ్చారు. అంతేకాదు.. ఈ గ్యాంబ్లింగ్ కోసం స్పెషల్ ఫ్లైట్లలో కూడా వెళ్లారని ఆయన విమర్శించారు. వైవీ సుబ్బారెడ్డి దయవల్లే బాలినేని ఎమ్మెల్యే అయ్యారని.. అలాంటి వైవీని ఆడిపోసుకోవద్దని సూచించారు. అంతటితో ఆగని గోనె.. బాలినేని టీడీపీలోకి వెళ్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోందని వ్యాఖ్యానించడం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యింది. గోనె చేసిన ఈ వ్యాఖ్యలకు బాలినేని పై విధంగా స్పందించారు.

సొంత పార్టీ నేతలపై బాలినేని తీవ్ర అసంతృప్తి..

గోనె గురించి మాట్లాడిన తర్వాత సొంత పార్టీ నేతలపై బాలినేని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'వైసీపీ కోసం ఎంత శ్రమించానో, ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు. నేను పార్టీ మారుతానని మా నేతలే ప్రచారం చేస్తున్నారు. కార్యకర్తలకు న్యాయం చేయలేనప్పుడు పదవులు ఎందుకు..?. రీజనల్ కోఆర్డినేటర్ పదవి చెయ్యలేనని సీఎం జగన్ కి నేనే చెప్పా. నాపై ఎమ్మెల్యేలతో సీఎంకు ఫిర్యాదు చేయిస్తున్నారు. నన్ను ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా వైసీపీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటా. కార్యకర్తలకి న్యాయం చేస్తుంటే నాపై ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు చేసే వాళ్ళు ఒక్క ఆరోపణ అయినా రుజువు చేయాలి. నేను టికెట్ ఇప్పించిన వాళ్లే నన్ను టార్గెట్ చేస్తున్నారు' అని జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో పాటు పరోక్షంగా పార్టీ పెద్దలపై కూడా బాలినేని విమర్శలు గుప్పించారు.

మొత్తానికి చూస్తే.. బాలినేని ఎపిసోడ్ రోజురోజుకూ పెరుగుతోందే తప్ప ఫుల్ స్టాప్ పడే పరిస్థితులు మాత్రం కనిపించట్లేదు. ఇప్పటికే వైసీపీలో ఈయన కామెంట్స్ హాట్ టాపిక్ అవ్వగా తాజాగా చేసిన కామెంట్స్ కు ఏ పరిణామాలకు దారితీస్తాయో తెలియని పరిస్థితి. ఈ వ్యవహారంపై వైవీ సుబ్బారెడ్డి, గోనె ప్రకాష్ ఎలా రియాక్ట్ అవుతారో వేచి చూడాల్సిందే మరి.

# జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి : భట్టి విక్రమార్క

నల్గొండ, మే5:జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. యాదాద్రి జిల్లా పోచంపల్లి మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు బట్టి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఓవైపు ఉద్యోగాలు లేక నిరుద్యోగులు బాధపడుతుంటే. ఉద్యోగాలు చేస్తున్న వారిని ప్రభుత్వం వివిధ కారణాలతో వేధిస్తుందన్నారు. మూడు సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని నాలుగు సంవత్సరాలకు పెంచడం అన్యాయమని, నాలుగు సంవత్సరాల కాలం పూర్తి చేసుకున్న వారి ప్రొవైషనరి కాలాన్ని డిక్లేర్ చేయకపోవడంపై భట్టి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

# పేదల శ్రేయస్సు కోసమే సంక్షేమ పథకాలు

**– కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ**

**– 117 మందికి రూ.1.17 కోట్లు, నేటి వరకు 8223 చెక్కులకుగాను రూ.77.30 కోట్లు పంపిణీ**

**– లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పువ్వాడ**



ఖమ్మం, మే6: (నేటినిజం ప్రతినిధి): పేదల శ్రేయస్సు కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వెల్లడించారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఖమ్మం నియోజకవర్గం పరిధిలో మంజూరైన కల్యాణలక్ష్మి,షాది ముభారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఇప్పటి వరకు ఖమ్మం నియోజక వర్గంలోని ఖమ్మంలో 73,రఘునాధపాలెంలో44 మొత్తం117చెక్కులు పంపిణీ చేశామని,నేటి వరకు 8223చెక్కులకు గాను రూ.77.30 కోట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తం గా వేల కోట్ల నిధులను సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. ఇక రైతులకు 24 గంటల విద్యుత్,ఆసరా పెన్షన్లు, సాగు,త్రాగు నీరు, పేద ఆడపడుచులకు కేసీఆర్ కిట్లు, ఆడపిల్ల జన్మిస్తే రూ.13 వేలు,మగ పిల్లవాడు జన్మిస్తే రూ.12 వేలు ప్రభుత్వం అందిస్తోందని మంత్రి వివరించారు. రైతులకు ,విద్యార్థులకు, వ్యాపారస్తు లకు కరెంటు కష్టాల నుండి తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ తన పాలనతో విముక్తి కల్పించారని వారు తెలిపారు. ఖమ్మం నగరంలో ఏ దిక్కున చూసిన అభివృద్ధి ఏదో ఒక రూపంలో కనిపిస్తుంది అని,ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేసుకున్నందుకు బీఆర్ఎస్ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలులిపించుకోవాలని, కేసీఅర్ ని ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు మంత్రి పువ్వాడ స్వయంగా వడ్డించారు. అనంతరం వారి కుటుంబీకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

# మమత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**–ప్రారంభించి,మందులు పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ**



ఖమ్మం, మే6: (నేటినిజం ప్రతినిధి): అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటోన్న పేద ప్రజల మమత ఆసుపత్రి మరియు పువ్వాడ ఫౌండేషన్ సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని రవాణాశాఖ మంత్రి, పువ్వాడ ఫౌండేషన్ చైర్మన్ పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. ఖమ్మం నగరం 34వ డివిజన్ రంగనాయకుల గుట్ట వద్ద పేదల కోసం ఎర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి పువ్వాడ ప్రారంభించి,ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మమత ఆసుపత్రి అధ్వర్యంలో గత 10 ఏళ్ళుగా జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వైద్య శిబిరాలు నిర్వహించి లక్షలాది రూపాయల విలువైన ఉచిత మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. స్థానిక ఆరోగ్య సమస్యలను గుర్తించి,స్థానిక ప్రజలు,అక్కడ ప్రజాప్రతినిధుల కోరిక మేరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల వద్దకు వైద్యాన్ని అందిస్తు న్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం,కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి ఉపేందర్,సుడా చైర్మన్ విజయ్ కుమార్,ఆర్జేసీ కృష్ణ,క్యాంప్ ఇంఛార్జి పి.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# రైస్ మిల్లుల బాగోతంపై మంత్రి వేముల ఫైర్

నిజామాబాద్, మే 6: నిజామాబాద్ జిల్లాలో రైస్ మిల్లుల బాగోతంపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. కడ్తా పేరుతో దోచుకుంటున్నారని రైతులు వేల్పూర్ లోని మంత్రి నివాసంలో గోడు వెళ్ల బోసుకున్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే.. జిల్లాలో కొన్ని రైస్ మిల్లులు కడ్తా పేరుతో రైతులను మోసం చేస్తుండటాన్ని మంత్రి వేముల సీరియస్ గా తీసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు రైస్ మిల్లర్ల తీరును మంత్రికి వివరించారు. దీంతో రైస్ మిల్లర్ల వ్యవహారంపై మంత్రి సీరియస్ అయ్యారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమతుకు ఫోన్ కాల్ చేశారు. జిల్లాలోని పలు రైస్ మిల్లులు ఆగడాలపై కలెక్టర్ కు వివరించారు. రైతులను నష్టపరిచే విధంగా రైస్ మిల్లులు కడ్తా పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని సూచించారు మంత్రి. జిల్లాలో మొత్తం 220 రైస్ మిల్లులకు అలాంట్ మెంట్ ఇస్తే.. అందులో ఐదు రైస్ మిల్లర్లు రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రి వేముల కలెక్టర్ కు వివరించారు. ప్రధానంగా జిల్లాలోని ఐదు రైస్ మిల్లులు పద్మావతి రైస్ మిల్, కాపర్తి ఇండస్ట్రీస్, ఎల్ జీ ఆగ్రో, రుద్రా ఇండస్ట్రీస్, త్రివేణి రైస్ మిల్లులు కడ్తా పేరుతో రైతులను మోసం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. ఈ ఐదు రైస్ మిల్లులో తక్షణమే పద్మావతి రైస్ మిల్లులో అలాట్ మెంట్ నిలిపివేయాలని ఈ ఏడాది బాన్ చేయాలని మంత్రి వేముల కలెక్టర్ కు ఆదేశించారు. మిగతా నాలుగు రైస్ మిల్లర్లకు హెచ్చరికలు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. మరోసారి కడ్తా పేరుతో మోసం చేస్తే మిగతా 4 మిల్లులను కూడా సీజ్ చేయాలని మంత్రి కలెక్టర్ కు చెప్పారు. క్లస్టర్ వైజ్ గా అన్ లోడింగ్ సక్రమంగా జరిగేందుకు ఆఫీసర్లను నియమించాలని మంత్రి సూచించారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అన్నారు.

జిల్లాలో ఇప్పటికే అకాల వర్షాలు అన్న దాతలను నిండా ముంచుతున్నాయి. వరి రైతులు చాలా నష్టపోతున్నారు. తడిసిన ధాన్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు రైస్ మిల్లర్లు రైతులను కడ్తా పేరుతో ఇబ్బంది పెట్టడం సరికాదని మంత్రి అన్నారు. జిల్లాలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి రైతులకు అభయమిచ్చారు. కడ్తా సమస్యను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లిన తక్షణమే స్పందించి కలెక్టర్ కు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని చెప్పటంతో మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు రైతులు. అంతకు ముందు అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం? ధాన్యం కొనుగోలు పై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాలని అన్నారు. అన్నివిధాలా ఆదుకుంటామని అన్నదాతకు భరోసా అందించాలని సూచించారు. టెలీ కాన్ఫిరెన్స్ లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంట వెంట మిల్లులకు తరలించి అన్ లోడింగ్ చేయించాలని అధికారులకు మంత్రి వేముల సూచించారు.

# సీఎం కేసీఆర్ ఒక విజన్ తో పని చేస్తున్నారు : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిజామాబాద్, మే6:తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఒక రోల్ మోడల్ గా చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విజన్ తో పని చేస్తున్నారని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం దివ్యా ఆర్డెన్ లో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. రాకముందు సాగు, తాగునీళ్లు, కరెంటు లేక గోసపడ్డాం? పంటలు పండక,పండిన పంటను అమ్ముకోలేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ రాష్ట్రం వచ్చాక వ్యవసాయంలో ప్రగతి సాధించాం. ఎండాకాలం వస్తే బోర్ కొట్టి ఇబ్బందుల పడేవారు? ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ పరిశుద్ధమైన నీటిని అందిస్తున్నాం. మహిళల ఓట్లు తప్ప కష్టాలను ఏ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రిపై ప్రజల ఆశీర్వాదం ఉందన్నారు. రాష్ట్రం ప్రభుత్వంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని, పార్టీ నాయకులు కార్యకర్తలు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తున్నదని, చిన్న రాష్ట్రం, కొత్తగా ఏర్పడిన తెలంగాణకు సహకరించాల్సింది పోయి



నిర్మల్ పుర వీధులన్ని గులాబీమయంగా మారాయి. రాంనగర్ (16 వార్డు) కౌన్సిలర్ తారక వాణీ రఘువీర్ దంపతులు కాంగ్రెస్ పార్టీ వీడి తమ అనుచరులతో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారందరికీ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ మాత్రమే వారి కష్టాలను గుర్తించారు. కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు తీసుకొచ్చి.. నేనున్నా అనే భరోసా సీఎం కేసీఆర్ కల్పించారు.

ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుభీమా, చేపలు, గొర్రెలు, దళిత బంధు, ఆసరా పింఛన్లు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. తొమ్మిది ఏళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారని, మన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని కేంద్ర వైఖరిని తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో రాష్ట్రంపై చిన్న చూపును చూపిస్తున్నదన్న విషయాన్ని ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# సైబర్ సెక్యూర్టీలో భాగంగా డేటా రక్షణ ప్రక్రియ

న్యూ ఢిల్లీ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సైబర్ సెక్యూర్టీలో భాగంగా డేటా రక్షణ గురించి జాతీయ మోడల్ ను రూపొందించే ప్రక్రియలో ఉన్నామని సీజేఐ చంద్రచూడ్ తెలిపారు. వర్చువల్ విచారణలు చేపట్టేందుకు హైకోర్టులు సిద్ధంగా ఉండాలన్నారు. ఒకసారి ఈ–ఫయిలింగ్ జరిగితే, మళ్లీ ఫిజికల్ ఫయిలింగ్ అవసరం లేదన్నారు. న్యాయవాదులు టెక్నాలజీలో రాటుదేలాలన్నారు. డేటా సెక్యూర్టీ, డేటా ప్రైవసీ గురించి సీజేఐ డీవై చంద్రచూడ్ఇవాళ కీలక వ్యాఖ్యలు చేశారు. సైబర్ సెక్యూర్టీ అంశంలో డేటా రక్షణ, ప్రైవసీ చాలా కీలకమైనవి, ఆ అంశాలను స్టడీ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశానని, ఆ కమిటీ రిపోర్టు ఇచ్చేందుకు ఎక్కువ టైం తీసుకుంటోందని, అయితే డేటా సెక్యూర్టీ, ప్రైవసీ అంశంలో జాతీయ మోడల్ ను రూపొందించే ప్రక్రియలో ఉన్నామని డీవై చంద్రచూడ్ అన్నారు. ఒడిశాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డేటా రక్షణ, ప్రైవసీ అంశంలో జాతీయ మోడల్ ను రూపొందిస్తే అప్పుడు మనం పెద్ద అడుగు వేసినట్లు అవుతుందన్నారు. న్యాయవాదులు, న్యాయవ్యవస్థ టెక్నాలజీని అలవర్చుకోవాలని, ఫిర్యాదుదారుల ప్రయోజనాల కోసమైనా ఇది తప్పదన్నారు. జడ్జీలకు టెక్నాలజీ తెలియదని, ఫిర్యాదుదారుల్ని ఇబ్బంది పెట్టలేమన్నారు. హైకోర్టులు టెక్నాలజీ వాడాలని, వర్చువల్ విచారణలు జరపాలని సీజేఐ కోరారు. కేవలం కోవిడ్ మహమ్మారి సమయంలో మాత్రమే కాదు, న్యాయవ్యవస్థ వర్చువల్ విచారణకు సిద్ధం కావాలన్నారు. లాయర్లు వర్చువల్ రీతిలో కేసు విచారణకు హాజరయ్యే అవకాశాన్ని హైకోర్టులు కల్పించాలన్నారు. ఈ–ఫయిలింగ్స్ కోసం కోర్టులు సిద్ధం అవుతున్నాయని, కానీ ఒకసారి ఈ–ఫయిలింగ్ జరిగితే, అప్పుడు మళ్లీ ఫిజికల్ ఫయిలింగ్ అవసరం ఉండకూడదని సీజేఐ అన్నారు. పేపర్ లెస్, వర్చువల్ కోర్టులు ఏర్పాటు చేయాలన్న విజన్ తనకు ఉన్నట్లు చెప్పారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుంది

మెదక్, మే6: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విపత్కర పరిస్థితులలో అధికార యంత్రాంగం యావత్తు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తూ, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పిస్తున్నామని అన్నారు. ధాన్యం సేకరణలో రైతులకు ఏ చిన్న ఇబ్బంది సైతం తలెత్తకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలిచ్చామని, కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా నిత్యం మానిటరింగ్ చేస్తూ సమస్యలను అధిగమిస్తున్నామన్నారు. అదేవిధంగా తరచూ మిల్లర్లలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ కేంద్రాల నుండి ధాన్యం వచ్చిన వెంటనే దించుకొని, ట్రక్ షీట్ అందజేయాలని, లారీలను వెయిటింగ్ లో పెట్టవద్దని, హమాలీలలను అధిక సంఖ్యలో పెట్టుకోవాలని, ధాన్యం భద్రపరచుటకు స్థలం ఏర్పాటు చేసుకోవాలని సూచించామన్నారు. ఎక్కడా గన్ని సంచుల కొరత రాకుండా ప్రతి రోజు మానిటరింగ్ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కాగా 2021–22 యాసంగి కి సంబంధించి ఎఫ్.సి.కి, పౌర సరఫరాల శాఖకు పెండింగ్ ఉన్న 69,253 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ ను రోజువారీ లక్ష్యం మేరకు ధాన్యం మరాడించి డెలివరీ చేయాలని, డిఫాల్ట్ అయిన వారిపై చర్యలు తీసుకుంటామని రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లర్లను హెచ్చరించారు. ఇంతవరకు జిల్లాలో 358 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3,371 మంది రైతుల నుండి సుమారు 30 కోట్ల విలువ గల 14,542 మెటిక టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 3 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో వేశామని అన్నారు. త్వరితగతిన టాబ్ ఎంట్రీ పూర్తి చేసి మిగతా రైతుల ఖాతాలో కూడా డబ్బులు వేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి పదివేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించనుందని అన్నారు.

## ఘాట్ రోడ్డులో బస్సు బోల్తా.. 10మందికి తీవ్రగాయాలు

న్యూఢిల్లీ, మే 6:నల్లమల ఘాట్ రోడ్డులో బస్సు బోల్తాపడడంతో 10మందికి తీవ్రగాయాలైన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లాలో చోటుచేసుకుంది. నంద్యాల జిల్లాలోని నల్లమల ఘాట్ రోడ్డులో బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 10మందికి తీవ్రగాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# సుడాన్ నుంచి దాదాపు 24 గంటల నిరవధిక ప్రయాణంతో ఐఏఎఫ్ సి-17 ద్వారా వ్యూహాత్మక సహాయక ఆపరేషన్



న్యూఢిల్లీ, మే 6:భారత వైమానిక దళానికి చెందిన సి–17 గ్లోబ్ మాస్టర్ విమానం ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో హిందాన్ నుంచి బయలుదేరింది, రాత్రంతా ప్రయాణించి సౌదీ అరేబియాలోని జెడ్డాలో తెల్లవారుజామున దిగింది. యుద్ధ ప్రభావిత సూడాన్ చిక్కుకున్న భారతీయులను తిరిగి భారతదేశానికి తీసుకు రావడానికి, జెడ్డా వద్దే ఇంధనాన్ని నింపుకుంది. సూడాన్ లో ఇంధనం అందుబాటులో లేకపోవడం, ఇంధనం నింపడంలో ఆలస్యాన్ని నివారించడానికి జెడ్డా వద్దే అదనపు ఇంధనాన్ని తీసుకుంది. ఈ విమానంలో 192 మంది ప్రయాణీకులు ఉన్నారు, వాళ్లలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు, వృద్ధులు. వారంతా ఎన్ఆర్ఐలు, విదేశీ పౌరులు, ఓసీఐలు (భారతదేశ విదేశీ పౌరులు). వారిని జెడ్డాకు తీసుకెళ్లడం సాధ్యం కాదు, నిరవధిక ప్రయాణం ద్వారా నేరుగా భారతదేశానికి తరలించాల్సిన అవసరం ఉంది.

సూడాన్ వద్ద, ఈ భారీ జెట్ ను ల్యాండ్ చేయడానికి యుద్ధ దాడి విధానాన్ని అనుసరించింది. ఎందుకంటే, ఆ ప్రదేశం నుంచి త్వరగా తిరిగి వెళ్లిపోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

ఈ ఆపరేషన్ సమయంలో, ప్రయాణీకుల్లో ఒకరు అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ పరిస్థితిని ముందుగా ఊహించకపోయినా, విమాన సిబ్బంది దానిని సమర్థవంతంగా నిర్వహించారు. అతని ఆరోగ్య పరిస్థితి కుదుటబడే వరకు సంపూర్ణ ఆక్సిజన్ అందించారు.

విమానం ఈ నెల 4వ తేదీ సాయంత్రం తర్వాత అహ్మదాబాద్ లో ల్యాండ్ అయింది, అదే రోజు అర్ధరాత్రి హిందాన్ లో దిగింది. సూడాన్ లో చిక్కుకుపోయిన స్వదేశీయుల్లో చివరి వ్యక్తిని కూడా భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి వైమానిక దళ సిబ్బంది దాదాపు 24 గంటల పాటు నిరవధిక విధుల్లో ఉన్నారు.

# రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ అన్సారికి శుభాకాంక్షల వెల్లువ



నిజామాబాద్, మే6:మైనారిటీ కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తారిక్ అన్సారీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని అనుక్షణం ప్రత్యేక రాష్ట్రం కోసం మైనారిటీల తరపున ముందుండి పోరాడినందుకు తెలంగాణ రాష్ట్రం ఆయన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ గా తారిక్ అన్సారీని నియమించారు. శనివారము హైదరాబాద్ లో ప్రమాణస్వీకారం చేసారు. ఈ సందర్భంగా టీఎస్ డబ్ల్యూసీడీఎస్ చైర్ పర్సన్ ఆకుల లలిత రాఘవేందర్ తారిక్ అన్సారీకి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం పోరాట ప్రతిమను, ప్రాధాన్యతను, ప్రత్యేకతను గుర్తించి మీకు సమున్నత న్యాయం కల్పించిందని సంతోషంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన తారిక్ అన్సారీకి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల పుష్పగుచ్ఛం అందజేసి తారీకు అన్సారని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ కుద్దుస్, ముజాహిద్ బబ్బు, అక్తర్ ఖాన్, ఖుద్దుస్, పాల్గొన్నారు.

# నా జీవం ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తా.. స్పీకర్ పోచారం



నిజామాబాద్, మే6:నా జీవం ఉన్నంత వరకు బాన్సువాడ నియోజకవర్గం ప్రజలకు సేవ చేస్తానని శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ నియోజకవర్గం లోని స్వగృహంలో, తిమ్మాపూర్ వద్ద కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్, డబల్ బెడ్ రూమ్ పథకాలపై మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు.

ఠఈ సందర్భంగా శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బాన్సువాడ నియోజకవర్గం లోని ప్రజాసేవయే నా ఆశయం ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ నిరుపేద బతుకుల్లో వెలుగు నింపడమే నా ఆశయం నా ప్రాణం ఉన్నంతవరకు ప్రజలే దేవుళ్ళుగా భావించి ప్రతినిత్యం ఏ కష్టం వచ్చినా నా కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందించడమే నా ఆశయం అంటూ ఆయన అన్నారు. శాసనసభాపతి అయిన బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యేగా నా విధి నిర్వహణలో ప్రజలతో మమేకమై వారి కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సమస్యలు ఎప్పటికప్పుడు తీర్చేందుకు కృషి చేస్తున్నానని ఆయన అన్నారు.

ప్రజలు నిరుపేద వర్గాల ఉండటానికి ఇల్లు లేక అద్దె భవనాల్లో ఉండి కష్టాల్లో ఉన్న వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. బాన్సువాడ నియోజకవర్గం 11000 వేలు రెండు పడకల గదులు ఇల్లు మంజూరు అయ్యాయని, ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వం సబ్సిడీ కింద ఇంత పెద్ద మొత్తంలో మంజూరు చేయడం ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 11 ఇండ్లలో కాంట్రాక్టర్ ద్వారా 3000 కట్టిస్తే మిగతా 8 ఇళ్లను లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్నారని ఆయన అన్నారు. విడతల వారీగా లబ్ధిదారులకు ఇంటి బిల్లులు చెల్లించడం జరుగుతుంది ఆయన పేర్కొన్నారు. త్వరలోనే మూడు లక్షల రూపాయల ఇంటి పథకం అమల్లోకి వస్తుందని నియోజకవర్గంలోని నిరుపేద వర్గాల ప్రజలకు ఇల్లు లేని లబ్ధిదారులకు అందరికీ మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బాన్స్వాడ మున్సిపాలిటీ రూరల్ మండలానికి సంబంధించిన 75 మంది కళ్యాణ్ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. 2017 సంవత్సరంలో ప్రారంభించిన కళ్యాణ్ లక్ష్మీ పథకం షాది ముబారక్ పథకం మొదటగా 51000 ప్రారంభమై ప్రస్తుతం లక్ష 116 ఇస్తున్నామని ఆయన అన్నారు. కళ్యాణ్ లక్ష్మి షాద్ ముబారక్తం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో పద్దా లక్షల మందికి నగదు సాయం అందించడం ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేనని ఆయన అన్నారు.

పట్టణ లక్షల మందికి నగదు సాయం కింద ఎందుకు 10,000 కోట్లు ఖర్చు అయినాయని ఆయన అన్నారు. ఇలాంటి పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలులో లేవని ఆయన అన్నారు. ఆడబిడ్డ కొండగా రాష్ట్ర ముఖ్యమంత్రి పథకాలు ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రమంతా ఒక కుటుంబం లాగా భావించి ప్రతి పేదవాడికి ఏదో పథకం పేరిట ప్రతి ఇంటింటా సంక్షేమ ఫలాలు అందించిన ఆరాధ్య దేవుడని ఆయన అన్నారు. పేదల కుటుంబాలు తక్కువ ఖర్చుతో వివాహాలు చేసుకోవడానికి బాన్సువాడ నియోజకవర్గంలో 50 కోట్లతో 80 జనరల్ ఫంక్షన్ హాల్స్ నిర్మిస్తున్నామని వీటిలో రోజు అద్దె కేవలం ఐదు వేల రూపాయలు మాత్రమే ప్రజలు చెల్లించాలని, వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రాజా గౌడ్, కామారెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, బాన్సువాడ ఎంపీపీ నీరజ వెంకటరామిరెడ్డి, బారాస మండల అధ్యక్షులు మోహన్ నాయక్ కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు ,పాల్గొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో దక్షిణ తెలంగాణ సస్యశ్యామలం.. నిరంజన్ రెడ్డి



మహబూబ్‌నగర్, మే6: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో దక్షిణ తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని, ప్రజల దశాబ్దపు కల నెరవేరుతున్నదని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఆదేశాలతో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు స్మిత సబర్వాల్, ఎంపీ రాములుతో కలిసి పరిశీలించారు. 2015 జూన్ 11న 35 వేల కోట్లతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగిందని, కొన్ని సాంకేతిక కారణాలవల్ల పనులు ఆలస్యమైనాయని మంత్రి తెలిపారు. ఇటీవల నూతన సచివాలయం ప్రారంభోత్సవం అనంతరం సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని నార్లాపూర్ రిజర్వాయర్ పంపు పనులను పరిశీలించడం జరిగిందన్నారు. కృష్ణానదిలోని ఏడు టీఎంసీల నీటితో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి నల్గొండ జిల్లాలను కలిపి 12 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక తయారు చేసినట్లు మంత్రి తెలిపారు.

భవిష్యత్తులో నీటి ఇబ్బందులు రాకుండా ఉన్న నిటి కేటాయింపులతో ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చేందుకు ఈ పథకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. పనులు పురోగతిలో ఉన్నాయని సంబంధిత ఇంజనీర్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్ నుండి దశలవారీగా ఎలక్ట్రికల్ మెకానికల్ పనులు ఇంజనీరింగ్ బృందాలతో ఏజెన్సీల ద్వారా పరిశీలించినట్లు తెలిపారు. ఇక్కడి ప్రాంత ప్రజల దశాబ్దపు కల త్వరలో నెరవేరబోతుందని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభమైతే దక్షిణ తెలంగాణ సస్యశ్యామలం కానున్నదని మంత్రి తెలిపారు. అనంతరం హైదరాబాదు నుండి వచ్చిన ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఏదులలో నీటిపారుదల శాఖ అధికారులతో సాగునీటి ప్రాజెక్టు పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ రాములు, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్ రావు, సలహాదారు పెంటా రెడ్డి, నాగర్ కర్నూల్ ఇరిగేషన్ సి ఈ హమీద్ ఖాన్, మేఘా కంపెనీ ప్రతినిధి ఉమామహేశ్వర్ రెడ్డి, జిల్లా అధికారులు, నీటిపారుదల శాఖ అధి. కారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవం పెంచడమే ప్రభుత్వలక్ష్యం

- పేదల ఇళ్లకు పట్టాలు కల్పించడం ఇదే తొలిసారి
- మీజాగాను మీకే ఇస్తున్నాం
- ఒకే డివిజన్ లో424 మందికిపట్టాలు

ఖమ్మం, మే6: (నేటినిజం ప్రతినిధి): పేదలకు శాశ్వత నివాస యోగ్యం కల్పించి, వారి ఆత్మగౌరవం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.ఖమ్మం నగరం స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మేలు చేసేందుకు తీసుకొచ్చిన జి.ఓనెం.58,59 పథకం క్రింద ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలంలో



17వ డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలవకట్టపై నివాసం ఉంటున్న పేదలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో.నెం. 58&59 ద్వారా మంజూరైన పట్టాలను శనివారం బృందావనం గార్డెన్స్ నందు మంత్రి పువ్వాడ లబ్ధిదారులకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నివాసాలకు వారికి పూర్తి హక్కు కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మంలోనే మొదటిగా జి.ఓనెం.58,59 పథకం క్రింద పెద్ద ఎత్తున పట్టాలు సిద్ధం చేసి మునుపెన్నడూ లేని విధంగా ఈ పథకం ద్వారా శాశ్వత ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసిందన్నారు.ఈ పథకం ద్వారా ఖమ్మం నగరంలో 2800 మందికి ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి అక్కడే స్థిర నివాసం ఉండేందుకు హక్కు పత్రాన్ని కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది అని అన్నారు.

గడువు ముగిసినప్పటికీ మంత్రుల విజ్ఞప్తి మేరకు ఈ నెల మళ్ళీ పొడిగించడం జరిగిందని, మిగిలి ఉన్న వారు ధరఖాస్తు చేసుకోవాలని మళ్ళీ ఇలాంటి అవకాశం రాదని స్పష్టం చేశారు.ఒకేసారి డివిజన్ లో ఇంత పెద్ద ఎత్తున పేదలకు పట్టాలు ఇవ్వడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయొచ్చు గాకా...కాని పేదలకు శాశ్వత నివాసం కల్పిస్తూ ఇలాంటి పనులు చేయడం ద్వారా జీవితానికి ఒక సంతృప్తిని ఇస్తుందన్నారు.

ఒకప్పుడు ఖమ్మం నేడు ఖమ్మం ఎలా ఉంది.. కనీసం ప్రయాణించడానికి రోడ్లు సరిగా లేక, విద్యుత్ దీపాలు లేక, త్రాగునీరు లేక, అధ్వానంగా ఉన్న సైడుకాల్వలు ఇలాంటి మరెన్నో సమస్యల నుండి నేడు ఖమ్మం నగరంలో హైదరాబాద్ నగరంలోని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి తరహాలో రూ.180 కోట్లతో నగరంలో మున్నేరు పై కేబుల్ బ్రిడ్జి త్వరలో కట్టుకోబోతున్నమని గుర్తు చేశారు. ఇది ఎవరైనా ఊహించి ఉంటారా... అని అన్నారు.

ఇన్ని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మనం కాపాడుకోవాలని మళ్ళీ ముఖ్యమంత్రిగా కేసీఅర్ నే గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్రనాథ్,కార్పొరేటర్లు ధనాల రాధ కొండయ్య,గజ్జెల లక్ష్మీ,సుడా చైర్మన్ విజయ్ కుమార్,ఏఎంసి చైర్మన్ శ్వేత,తాసిల్దార్ శైలజ, ఆర్జేసీ కృష్ణ,పగడాల నాగరాజు, పాలడుగు పాపారావు,ధనాల శ్రీకాంత్,మాటూరి లక్ష్మీనారాయణ,నీలం కృష్ణ,వద్దెల్లి లెనిన్,మస్తాన్, కన్నం ప్రసన్న తదితరులు ఉన్నారు.

# లండన్‌లో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్, మే6:బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను లండన్ నగరం లోని హౌన్స్లో ప్రాంతంలో ఎన్నారై బీఆర్ఎస్‌యూకే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, విశిష్ట అతిథిగా ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం పాల్గొన్నారు. ముందుగా జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి, అమరవీరులని స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పార్టీ జెండా ఎగరేసి, ' దేశ్ కి నేత కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు.

కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూతెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర సాధనకోసం ఎన్నారైలంతా క్రియాశీలకంగా పనిచేశారని గుర్తు చేశారు.పార్టీ కార్యక్రమాలతో పాటు ఎన్నారై ఆడబిడ్డలు బతుకమ్మను, బోనాలను సైతం మరువకుండా తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని అభినందించారు.సాధించుకున్న రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలో మొదటి స్థానంలో ఉందని, తెలంగాణ మోడల్ దేశానికి దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు.

ఎఫ్‌డీసీ చైర్మన్, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ జెండా దేశ నలుమూలల ఎగరాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి ఎన్ఆర్ఐలు బాధ్యత తీసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చరిత్రలో నిలవడం ఖాయమని అనిల్ తెలిపారు.

# ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

అమరావతి, మే 6: దైవ దర్శనానికి వెళ్లి తిరుగుప్రయాణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడిన ఘటన ఏపీలోని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో చోటు చేసుకుంది. జిల్లాలోని తొట్టంబేడు మండలం కంచనపల్లికి చెందిన దయా సాగర్ రెడ్డి (54) అతడి భార్య మధు మతి, కొడుకు డాక్టర్ సూర్యతేజ(33), కోడలు డాక్టర్ మౌనిక తిరువన్నా మలైలోని అరుణాచల గిరిప్రదక్షిణకు కారులో బయలు దేరారు.

గిరి ప్రదక్షిణ అనంతరం తిరుగుప్రయాణంలో కంచి సమీపం లో వీరి కారును మినీ బస్సు ఢీ కొట్టడంతో కారు బోల్తా పడి తీవ్రగాయాలతో దయాసాగర్‌రెడ్డి, కుమారుడు సూర్యతేజ, కోడలు మౌనిక మృతి చెందారు. మధుమతి కి తీవ్ర గాయాలు కావడంతో ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యేలతో సమావేశం ఉందని పిలిచి అవమానించిన మంత్రి తలసాని:రాజా సింగ్

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మరో కొత్త రగడ మొదలైంది. ఫైర్ బ్రాండ్ కమ్ సంచలన వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు బీజేపీ వేటు పడిన రాజాసింగ్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా నూతన సచివాలయం వద్దకు వచ్చారు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్. ఆయన్ను అడ్డుకున్నారు సచివాలయ భద్రతా సిబ్బంది. తనను మంత్రి తలసాని శ్రీనివాసరావు పిలిచి అవమానించారంటూ విరుచుకుపడ్డారు. హైదరాబాద్ మహానగర ఎమ్మెల్యేలతో సమావేశం ఉందని తలసాని పిలిస్తే.. సచివాలయానికి వచ్చానని.. కానీ తనను అనుమతించకుండా అవమానించారంటూ ఆయన మండిపడ్డారు. ప్రజల డబ్బులతో కట్టిన సచివాలయాన్ని ప్రజా ప్రతినిధులను అనుమతించకపోవటం సిగ్గుచేటుగా పేర్కొన్నారు. కొత్త సచివాలయాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తూ ఉంది.సచివాలయాన్ని ప్రారంభించిన మూడో రోజునే అధికార పార్టీ ఎమ్మెల్యేలు సచివాలయానికి వస్తే.. అనుమతించకపోవటం విమర్శలకు తావిచ్చింది. ఇప్పటికే హైటెక్ సెక్యూరిటీని ఏర్పాటు చేసి.. ఎవరిని లోపలకు అనుమతించని వైనంపై ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇలాంటి వేళ.. తాజా ఎపిసోడ్ మరింత రచ్చకు తెర తీసేలా ఉందన్న మాట వినిపిస్తోంది. రాజాసింగ్ వ్యాఖ్యలపై మంత్రి తలసాని ఎలా రియాక్టు అవుతారన్నది చూడాలి.

# వట్టెం రిజర్వాయర్ పనులను పరిశీలించిన మంత్రి నిరంజన్ రెడ్డి, సీఎం ఓఎస్డీ స్మితా సబర్వాల్

నాగర్‌కర్నూల్, మే 6: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా వట్టెం వద్ద నిర్మిస్తున్న వెంకటాద్రి రిజర్వాయర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, సీఎం ఓఎస్డీ స్మితా సబర్వాల్, ఎంపీ రాములు, ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. వట్టెంలో దాదాపు 90 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిఆరు. మిగిలిన 10 శాతం పనులను గరిష్టంగా మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్యాకేజ్ నెంబర్ 12 దగ్గర మిషన్ భగీరథ కెనాల్‌ను పరిశీలించారు. కెనాల్‌కు హైడ్రాలిక్ గేట్‌ల ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఇంజనీర్లను ఆదేశించారు.

ఈ బృందంలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్, ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్ రావు, సలహాదారు పెంటారెడ్డి, ఇరిగేషన్ సీఈ హమీద్ ఖాన్, ఎస్ఈ విజయ్ భాస్కర్ రెడ్డి, ఈఈ పార్థ సారథి, మేఘా కంపెనీ ప్రతినిధి ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కేంద్రం నిర్లక్ష్యంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం : మంత్రి సత్యవతి రాథోడ్



యాదగిరిగుట్ట, మే6: కేంద్రం అవలంభిస్తున్న వైఖరి వల్ల గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాష్ట్ర గిరిజన,స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ముల్కంపల్లి స్టేజీ నుంచి గొల్లగూడెం వరకు రూ. 3 . 37 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్లకు , మల్కాపురం నుంచి పొట్టిమర్రితండ వరకు 2 కోట్ల 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్ పీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

గిరిజన సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని అన్నారు.ప్రతి గిరిజన తండా అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె అన్నారు.బీజేపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వమని, బీఆర్ఎస్ పార్టీ చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు.

జనాభా ప్రాతిపదికన గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసి అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి పంపిస్తే కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా మూలకు పడేసిందని దుయ్యబట్టారు. దేశంలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని వెల్లడించారు. బీజేపీ నాయకులు గిరిజనుల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ గిరిజన రిజర్వేషన్ల నుంచి పది శాతానికి పెంచి గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు.రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు . ఈ కార్యక్రమంలో ఆలేరు శాసన సభ్యురాలు గొంగిడి సునీత, టీస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ట్రైకర్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్ ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా యాత్రలో ఉద్రిక్తత

- పొంగులేటి అనుచరులు, పోలీసుల మధ్య తోపులాట
- కలెక్టరేట్ ఎదుట పొంగులేటి అనుచరులు నిరసన




ఖమ్మం, మే6: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రైతు భరోసా యాత్రలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్తత ఏర్పడింది. పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు, పోలీసుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టరేట్ లోపల వెళుతున్న నేపథ్యంలో పోలీసులు అడ్డుకున్నారు. లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయటంతో ఒక్కసారిగా పొంగులేటి అనుచరులు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కొంతమందినే లోపలకు అనుమతించారంటూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట రైతులు చేతుల్లో మొక్కజొన్న వరి ధాన్యాలతో నిరసన వ్యక్తం చేశారు.

# దశదినకర్మలో మేకల మల్లిబాబు యాదవ్

ఖమ్మం, మే6: (నేటినిజం ప్రతినిధి): ముదిగొండ మండలం మాదాపురం గ్రామంలో జరిగిన రాజనాల వెంకన్న తల్లి రాజనాల లక్ష్మీ దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అఖిలభారత యాదవ మహాసభ గౌరవధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్.ఈ కార్యక్రమంలో ధనియాకుల వెంకటనారాయణ యాదవ్, మేగడ బాబు యాదవ్,రాగం కోటేశ్వరరావు యాదవ్,చిలుకల కొండలు యాదవ్ తదితరులు హాజరై ఘనంగా నివాళు లర్పించడం జరిగింది.

# అమ్మవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



నిర్మల్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జువ్వాది శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాన్ని అందించి అర్చకులు, వేద పండితులు ఆశీర్వదించారు. హైకోర్టు న్యాయమూర్తి వెంట బైంసా ఇన్చార్జి జడ్జి జతిన్ సింగ్, ఏఎస్పీ కాంతి లాల్ పాటిల్, ఆర్డీఓ రవికుమార్, తాసిల్దార్ నారాయణ, పోలీస్ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది, న్నారు.

# రామారావుపల్లె గ్రామాభివృద్ధికి కృషి చేస్తా -డాక్టర్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, మే 6:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలం రామారావుపల్లె గ్రామంలో శనివారం నిర్వహించిన పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో డాక్టర్ గోలి మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు డాక్టర్ గోలి మోహన్ కు ఘన స్వాగతంతో గ్రామంలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అడగగానే పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టకు సహకరించిన డాక్టర్ గోలి మోహన్ గ్రామ ప్రజలందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో చాలామంది యువకులు చదువుకొని ఉపాధి లేక ఉన్నారని యువకులు డాక్టర్ గోలి మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రామారావుపల్లె గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామంలోని యువతకు చదువు, ఉద్యోగం, ఉపాధి కల్పించడానికి ముందుంటానని తెలిపారు. ప్రతి ఒక్కరు చదువుకొని ఉన్నతమైన స్థానానికి ఎదగడానికి అండగా ఉంటానని మాట ఇచ్చారు.

పంట నష్టం జరగకుండా అకాల వర్షాల నుంచి కాపాడాలని,

ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు. రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గం శాసనసభ్యునిగా పోటీ చేస్తున్నానని రామారావు పల్లె గ్రామ ప్రజలు నన్ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు డాక్టర్ గోలి మోహన్ ని శాలువాతో సత్కరించారు.

# మన ఊరు-మనబడి పనులను పరిశీలించిన డిఈఓ రమేష్ కుమార్



రాజన్న సిరిసిల్ల, మే6:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను శని వారం జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భం గా మండలంలోని అన్ని పాఠశాలల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, డ్రింకింగ్ వాటర్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రా న్ని సందర్శించి విద్యార్థులకు యూనిఫామ్స్ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాడు అందజేసేలా చూడాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు దరిపెల్లి శ్రీనివాస్, ఎంపీపీ ఎస్ లక్ష్మీపూర్ హెచ్ఎం శిలాపురం శంకరయ్య, సిఆర్పీలు నగేష్, ఎల్లేష్, ఎఐఎస్ నవీన్, సిసిఓ ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

# త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, మే6:(నేటి నిజం ప్రతినిధి): నంది కమాన్ కూడలి ప్రవేశ ద్వారంను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సుందరంగా తీర్చిదిద్దాలి జిల్లా కలెక్టర్ జయంతి. నంది కమాన్ కూడలి ప్రవేశ ద్వారాన్ని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన వేములవాడ పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వేములవాడ పట్టణం లోని మూల వాగుబనీడ్ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పట్టణ ప్రజలకు సరికొత్త అనుభూతిని చ్చేలా, పిల్లలు పెద్దలు ఉదయం, సాయంత్రం వేళల్లో అహ్లాదవాతావరణంలో సేదదీరేలా బనీడ్ ను అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటికే సింహభాగం పనులు పూర్తి అయినందున పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మల్లారం రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను పరిశీలించారు. జూన్ రెండు లోగా పూర్తిచేయాలన్నారు. సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మున్సిపల్ ఏ ఈ నర్సింహ తదితరులు ఉన్నారు.




ఓల్గా నవల

పంపాతీరం

రవీంద్ర భారతి కన్ఫరెన్స్ హాల్
సా. 06.గం – మే. 07.2023.

పుస్తకావిష్కరణ

ఆవిష్కర్త: రోహిణి
(ప్రముఖ సినీ నటి)

ముఖ్య అతిథి: డా. సి.మృణాళిని

పుస్తక పరిచయ: డా. ప్రసాదమూర్తి

అభినందన: డా. మామిడి హరికృష్ణ

స్పందన: ఓల్గా

స్వేచ్ఛ ప్రచురణలు


# 8 న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వరల్డ్ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ జయంతి ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8 న రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు రాష్ట్ర శాసన మండలి సభ్యులు ఎ. వి. యన్ రెడ్డి , హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ వైస్ ప్రెసిడెంట్ యం. వెంకటేశ్వర్లు,టి యన్ జి ఓ గెజిటెడ్ ఆఫీసర్ ల సంఘం హైదరాబాద్ అధ్యక్షులు కృష్ణా యాదవ్, టిబి–హైదరాబాద్ కన్వీనర్ డా. బి. విజయ్ భాస్కర్ గౌడ్, హైదరాబాద్ అసీఫ్ నగర్ తహసీల్దార్ షేక్. ఫర్హీన, ఇందిరా ప్రియదర్శిని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ శ్రీమతి డా. డి. వరలక్ష్మి గారు,రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్ మరియు విజిలెన్స్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి, కాంట్రాక్టర్లు ఎ. వి రావు విచ్చేయున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మొదటగా గా 08. వ తేదీన ఉదయం 09.30 గంటలకు, హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి రెడ్ క్రాస్ జెండా ను ఆవిష్కరించి ఈ కార్యక్రమం ను ప్రారంభిస్తారు. తరువాత సేవా భావం ను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఉద్దేశంతో ర్యాలీ ను హైదరాబాద్ జిల్లా శాఖ నుండి మాసబ్ ట్యాంక్ చౌరస్తా వరకు విద్యార్థులు తో నిర్వహిస్తారు. అనంతరం విద్యార్థులు తో రెడ్ క్రాస్ గవర్నమెంట్ బాలికల పాఠశాల లో జె.ఆర్. సి మరియు వై. ఆర్. సీ సర్టిఫికేట్ లను ప్రదానం చేయడం జరుగుతుంది మరియు గవర్నర్ సహాయం తో టి బి పేషెంట్ లకు టిబి ఫుడ్ బాస్కెట్ కిట్స్ ను రెడ్ క్రాస్ జిల్లా శాఖా దగ్గర పంపిణీ చేయనున్నారు. రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 100 మంది తో రెడ్ క్రాస్ సభ్యత్వనీ ను చేయాలని మరియు మరింత మంది దాతలు ముందుకు వచ్చి టిబి ముక్త్ భారత్ అభియాన్ పథకం లో భాగమై విరాళాలు అందించి క్షయ వ్యాధి రోగులను ఆదుకోవాలని భీమ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమం కు రెడ్ క్రాస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఏపీ పదో తరగతి ఫలితాలు విడుదల.. బాలికలదే పైచేయి

విజయవాడ, మే 6: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మరోసారి బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో పదో తరగతి ఫలితాలను విడుదల చేశారు. పరీక్ష హాజరైన విద్యార్థుల్లో 72.26 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 75.38 శాతం మంది బాలికలు ఉండగా, 69.27 శాతం మంది బాలులు ఉన్నారు. 933 స్కూల్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత రాగా, 38 పాఠశాల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదయింది. కాగా, ఉత్తీర్ణ సాధించినవారిలో 75.8 శాతం మందికి ఫస్ట్ క్లాస్ రాగా.. పాసైనవారిలో ఇంగ్లిష్ మీడియాలో రాసిన స్టూడెంట్ 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి 18 వరకు నిర్వహించిన పరీక్షలకు మొత్తం 6,05,052 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో బాలురు 3,09,245, బాలికలు 2,95,807 మంది హాజరైన వారిలో ఉన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయినవారికోసం జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి బొత్స తెలిపారు. విద్యార్థులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈనెల 13వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు, అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు, ఆయా స్కూల్ టీచర్లను పోత్సహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి అఘాయిత్యాలు పాల్పడొద్దని.. పరీక్షలో ఫెయిల్ అయిన వారికి ప్రత్యేకంగా కోచింగ్ ఇప్పిస్తామని వెల్లడించారు. విద్యా సంవత్సరం వృథా కాకుండా వెంటనే ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు.

# తీరంవైపు దూసుకొస్తున్న 'మోచా' తుఫాన్..

హైదరాబాద్, మే6:దక్షిణ భారత దేశంలోని తూర్పుతీర రాష్ట్రాలకు మోచా తుఫాను ముప్పు పొంచి ఉన్నది. బంగాళాఖాతంలో తుఫాను ఏర్పడి తమిళనాడు రాజధాని చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో తీరాన్ని తాకే అవకాశం ఉన్నదని భారత వాతావరణ కేంద్రం (ఐఎంఆ) ప్రకటించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడనుందని, అది సోమవారం వరకు వాయుగుండంగా మారుతుందని తెలిపింది.

దానివల్ల ద్రోణి, ఉపరితల ఆవర్తనంతోపాటు బంగాళాఖాతంలో 'మోచా' తుఫాన్ ఏర్పడే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది. వాటి ప్రభావంతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతోపాటు ఒడిశాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. కాగా, తెలంగాణలో మరో రెండు రోజులపాటు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# సెంట్రల్ ఏషియన్ ఫ్లై వే (సీఏఎఫ్)లో వలస పక్షుల ఆవాసాల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు అమలు చేయాలని నిర్ణయించిన సెంట్రల్ ఏషియన్ ఫ్లై వే



న్యూఢిల్లీ, మే 6:వలస పక్షులు, వలస పక్షుల ఆవాసాల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు అమలు చేయాలని సెంట్రల్ ఏషియన్ ఫ్లై వే ప్రాంత దేశాలు నిర్ణయించాయి. సెంట్రల్ ఏషియన్ ఫ్లై వే (సీఏఎఫ్)లో వలస పక్షులు, వాటి ఆవాసాల కోసం పరిరక్షణ అమలు చేయాల్సిన చర్యలపై ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం/ వలస జాతులపై కన్వెన్షన్ (యూఎన్ఈపీ/సీఎంఎస్) సహకారంతో పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశం న్యూఢిల్లీలో 2023 మే 2 నుంచి 4 వరకు జరిగింది.

సమావేశాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ అశ్విని కుమార్ చౌబే ప్రారంభించారు. తన ప్రసంగంలో గ్లాస్గో లో జరిగిన కాప్ -26లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని మంత్రి ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధానమంత్రి ప్రతిపాదించిన లైఫ్ (పర్యావరణ పరిరక్షణ కోసం పర్యావరణం కోసం జీవనశైలి) విధానాన్ని మంత్రి వివరించారు. ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు సెంట్రల్ ఏషియన్ ఫ్లై వే (సీఏఎఫ్)లో వలస పక్షులు, వాటి ఆవాసాల కోసం పరిరక్షణ కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు భరతదేశం చర్యలు తీసుకుంటుందని మంత్రి అన్నారు. పర్యావరణహిత జీవనశైలి అవలంభించడం వల్ల వలస పక్షుల తో సహా అన్ని జీవుల ఉనికిని రక్షించడానికి అవకాశం కలుగుతుందన్నారు. భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని వలస పక్షుల తో సహా అన్ని జీవుల ఉనికిని పరిరక్షించడానికి తగిన చర్యలు అవసరమనిశ్రీ అశ్విని కుమార్ చౌబే స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీ అశ్విని కుమార్ చౌబే అన్నారు. పర్యావరణహిత జీవన శైలి కోసం ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన సమావేశం సెంట్రల్ ఏషియన్ ఫ్లైవేలో పరిరక్షణ,సుస్థిర అభివృద్ధి అనే ఉమ్మడి లక్ష్యం సాధనకు ఉపకరిస్తుందన్నారు.

అర్మేనియా, బంగ్లాదేశ్, కజకిస్తాన్, కిర్గిజ్స్తాన్, కువైట్, మంగోలియా, ఒమన్, సౌదీ అరేబియా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌తో సహా సెంట్రల్ ఏషియన్ ఫ్లై వే ప్రాంతంలోని పదకొండు దేశాలు, సిఎంఎస్, ఏఈడబ్ల్యుఏ, రాప్టర్స్ ఒప్పందంపై సంతకాలు చేసిన దేశాల, సెక్రటేరియట్‌లు, వన్యప్రాణి ముఖ్య ప్రతినిధులు, దేశానికి చెందిన శాస్త్రీయ సంస్థలు, అంతర్జాతీయ, జాతీయ ప్రభుత్వేతర సంస్థలు, నిపుణులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రాల వార్డెన్‌లు,

సెంట్రల్ ఆసియన్ ఫ్లైవే కోసం ఒక సంస్థాగత వ్యవస్థ రూపకల్పనపై సమావేశంలో ప్రతినిధులు చర్చించారు. వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ప్రతినిధులు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సిన ప్రాధాన్యత గల ప్రాంతాలను గుర్తించాలని నిర్ణయించారు. సీఎంఎస్ సీఏఎఫ్ ముసాయిదా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అంగీకరించారు. వలస పక్షులు, వాటి ఆవాసాలను పరిరక్షించడానికి ఆలోచనలు , ఉత్తమ విధానాల ద్వారా సహకరించుకోవాలి అని సమావేశంలో నిర్ణయించారు. వలస పక్షులు, వాటి ఆవాసాల పరిరక్షణకు ఒక సమన్వయ విధానాన్ని అభివృద్ధి చేయాలని సమావేశం తీర్మానించింది. వలస పక్షులు, వాటి ఆవాసాల పరిరక్షణకు కృషి చేయాలని సమావేశానికి హాజరైన దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది.

పక్షుల అభయారణ్యం నిర్వహణ, పక్షులసంరక్షణ కోసం భారతదేశంలో ఏర్పాటైన అభయారణ్యాలు, అభయారణ్యాల నిర్వహణ కోసం భారతదేశంలో అమలు జరుగుతున్న విధానాలు తెలుసుకోవడానికి ప్రతినిధులు హర్యానాలోని గురుగ్రామ్‌లోని సుల్తాన్‌పూర్ నేషనల్ పార్క్‌కు క్షేత్ర పర్యటనను కూడా చేపట్టారు.

# లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆదాయం రూ. 34.26 లక్షలు

యాదగిరిగుట్ట, మే6:లోని లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో ఆలయానికి భారీగా ఆదాయం సమకూరుతుందని ఆలయ అధికారులు వెల్లడించారు. శనివారం స్వామివారికి రూ. 34. 26 లక్షల ఆదాయం వచ్చిందని వివరించారు.

ప్రధాన బుకింగ్ ద్వారా రూ. 3,53,100, కైంకర్యముల ద్వారా రూ. 4,000, సుప్రభాతం ద్వారా రూ. 6,600,పుష్కరిణీ ద్వారా రూ. 1,400, వ్రతాల వల్ల ద్వారా రూ. 209,900 ఆదాయం సమకూరిందని తెలిపారు. ప్రచార శాఖ ద్వారా రూ. 25,,000, వీఐపీ దర్శనం ద్వారా రూ. 1,50,000, యాదరుషి నిలయము ద్వారా రూ. 1,05,040, ప్రసాదవిక్రయం ద్వారా రూ. 13,25,650,పాతగుట్ట ద్వారా రూ. 43,570, కళ్యాణ కట్ట ద్వారా రూ. 82,550 ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

శాశ్వత పూజల ద్వారా రూ. 32,500,వాహన పూజలకు రూ. 8,100,కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ. 4,50,000,సువర్ణ పుష్పార్చన ద్వారా రూ. 1,22,432,శివాలయం ద్వారా రూ. 11,600, అన్నదానం ద్వారా రూ. 34,100,బ్రేక్ దర్శనంద్వారా రూ. 3,01,200,లీజస్, లీగల్ ద్వారా రూ. 1,60,000 ఆదాయం వచ్చిందన్నారు.

# హైదరాబాద్ టు శ్రీశైలం.. ప్రతి అర గంటకు అందుబాటులో ఆర్టీసీ బస్సు

హైదరాబాద్, మే6:: భక్తుల డిమాండ్ మేరకు టీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ ఎంజీబీఎస్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రతి అర గంటకు ఒక బస్సును శ్రీశైలం క్షేత్రానికి నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈ బస్సులు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి రీజియన్‌ల నుంచి నడుపుతామని పేర్కొన్నారు.

ప్రతి రోజు తెల్లవారుజామున 3:30 గంటలకు ఎంజీబీఎస్ నుంచి తొలి బస్సు శ్రీశైలం క్షేత్రానికి బయల్దేరనుంది. ఆ తర్వాత ప్రతి అర గంటకు ఒక బస్సు అందుబాటులో ఉండనుంది. ఇక చివరి బస్సు ఎంజీబీఎస్ నుంచి రాత్రి 11:45 గంటలకు శ్రీశైలం బయల్దేరను. శ్రీశైలం నుంచి ప్రతి రోజు తెల్లవారు జామున 4:30 గంటలకు హైదరాబాద్‌కు ఒక బస్సు బయల్దేరును.

# ఘనంగా జవాన్ అనీల్ అంత్యక్రియలు

## -ప్రజాప్రతినిధులు, అధికారుల నివాళి



రాజన్న సిరిసిల్ల, మే6:(నేటినిజం ప్రతినిధి): జమ్మూ – కాశ్మీర్ లో సైనికులు ప్రయాణించిన హెలికాప్టర్ లో సాంకేతిక సమస్య ఏర్పడటంతో ప్రమాదానికి గురైన ఘటనలో మృతి చెందిన మల్కాపూర్ గ్రామానికి చెందిన అమర జవాన్ పబ్బాల అనిల్ అంత్యక్రియలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జవాన్ అంతిమ యాత్రలో రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్,రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినిపల్లి వినోద్ కుమార్, ఎంపి బండి సంజయ్, ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీఓ పవన్ కుమార్ లు, ఆర్మీ అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని, పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అమరవీరుడు అనిల్ త్యాగాన్ని ప్రజలు మరువలేరని అన్నారు. అనిల్ అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జై జవాన్, అమర జవాన్, పబ్బాల అనిల్ అమరహే అంటూ నినాదాలు చేశారు.

# ప్రాణం తీసిన క్యారమ్స్.. ఆటలో ఓడిపోయానని బాలుడి ఆత్మహత్య

ఖమ్మం, మే6:(నేటినిజం ప్రతినిధి): సరదాగా అక్కలతో కలిసి ఆడుతున్న క్యారమ్స్ ఆటలో ఓడిపోయనందుకు బాలుడు మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా కావేపల్లి మండలం అడవిమద్దులపల్లిలో చోటుచేసుకుంది. అడవిమద్దులపల్లి గ్రామానికి చెందిన భానోతు వెంకన్నకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గత రెండు సంవత్సరాల క్రితం వెంకన్న రహదారి ప్రమాదంలో మృతి చెందాడు.

మృతుడు ప్రభుత్వ విద్యుత్ శాఖలో పనిచేస్తూ మరణించడంతో వెంకన్న భార్యకు ఉద్యోగం ఇచ్చారు. అయితే రోజువారి దినచర్యలో భాగంగా తల్లి ఉద్యోగానికి వెళ్ళగా ఇద్దరు అక్కలతో కలిసి భానోత్ గోపి (11) క్యారంబోర్డు ఆడాడు.

రెండు మూడుసార్లు గేమ్‌లో ఓడిపోవడంతో చీర తీసుకొని ఇంట్లోకి వెళ్లి మరోసారి వచ్చి క్యారం బోర్డ్ ఆట ఆడాడు. మళ్లీ అక్కల చేతుల్లో ఓడిపోవడంతో మనస్తాపం చెంది ఇంటి వెనకాల కిటికీకి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన అక్కలు చుట్టుపక్కల వారిని పిలిచి రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం శూన్యమైంది. ఈ విషయం తన తల్లికి అందించగా ఆమె ఒక్కగాని ఒక్క కొడుకు మృతి చెందడంతో స్పృహతప్పి పడిపోయింది. చిన్నారులు గేమ్స్‌కి బానిసలు కావద్దని, ఆటను స్పిరిట్‌తో తీసుకొని ముందుకు వెళ్లాలే తప్ప ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

# రాగల మూడు గంటల్లో ఈ జిల్లాల్లో వర్షాలు

హైదరాబాద్, మే6:రాబోయే మూడు గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, సంగారెడ్డి, వరంగల్, భద్రాద్రి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించింది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు తదితర జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైందని టీఎస్‌డీపీఎస్ వివరించింది.






Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.